

# వార్త వేకువ

తెలుగు దినపత్రిక

నిజం వైపు నిరంతరం...

PRGI No: TGTEL/26/A2290

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : ఆవనగంటి అనిల్ కుమార్ సంపుటి : 01 సంచిక : 109 వెల : 4 పేజీలు : 08 సోమవారం 17 - 08 - 2026




## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



**వార్త వేకువ, హైదరాబాద్, ఆగస్టు 16 :** స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత - మిగతా 2 లో

## రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క




- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం
- మేడారం వనదేవతల సమక్షంలలో చేయూత పింఛన్లకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- పలువురు మహిళలకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం
- హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన రేవంత్

**వార్త వేకువ, హైదరాబాద్, ఆగస్టు 16 :**

## టీజీపీఎస్సీ కీలక ప్రకటన




- వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!
- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్

**వార్త వేకువ, హైదరాబాద్, ఆగస్టు 16 :** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు - మిగతా 2 లో

## మాజీ ప్రధాని వాజ్‌పేయీకి నివాళులు అర్పించిన ముర్ము, మోదీ



- సేవలను గుర్తు చేసుకున్న నేతలు
- అటల్ బిహారీ వాజ్‌పేయీ నివాళులు అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని
- వాజ్‌పేయి తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేశారన్న మోదీ
- కార్గిల్ యుద్ధంతో దేశ శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారన్న అమిత్ షా

**వార్త వేకువ,ఢిల్లీ, ఆగస్టు 16 :** భారత మాజీ ప్రధానమంత్రి దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా దిల్లీలోని 'సదైవ్ అటల్' (వాజ్‌పేయీ స్మారక చిహ్నం) వద్ద ఆదివారం ఉదయం పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో సహా పలువురు ప్రముఖులు పాల్గొని మాజీ ప్రధానికి అంజలి ఘటించారు. 2018లో ఇదే రోజున తుదిశ్వాస విడిచిన వాజ్‌పేయీని ఈ సందర్భంగా మోదీ స్మరించుకున్నారు. వాజ్‌పేయీ ఒక అసాధారణ రాజనీతిజ్ఞుడు అని అభివర్ణించారు. ఆయన - మిగతా 2 లో

## ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

- కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!
- కిమ్ జాంగ్ ఉన్‌తో తన బంధం గొప్పదంటూ పాత ఫొటోను పంచుకున్న ట్రంప్
- అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై తీవ్రంగా స్పందించిన ఉత్తర కొరియా
- ఇది 'అణు కూటమి'గా మారుతోందని, తీవ్రంగా స్పందిస్తామని ప్యాంగ్యాంగ్ వార్నింగ్
- కొత్త స్థాయి ముప్పును కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- ఇటీవలే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ఉద్రిక్తతలను పెంచిన ఉత్తర కొరియా



**వార్త వేకువ,ఢిల్లీ, ఆగస్టు 16 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా - మిగతా 2 లో

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్

- పార్కు, యూనివర్సిటీలో కాల్పులు
- అమెరికాలో మళ్లీ పెరిగిన కాల్పుల ఘటనలు
- కెంటకీలోని ఓ పార్కులో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి
- నాలుగేళ్ల చిన్నారితో సహా నలుగురికి గాయాలు
- వర్జీనియా యూనివర్సిటీలో మరో ఘటన, ఐదుగురికి గాయాలు
- కొద్దిరోజుల క్రితం జార్జియా స్కూల్‌లోనూ కాల్పుల ఘటన



**వార్త వేకువ,ఢిల్లీ, ఆగస్టు 16 :** అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ - మిగతా 2 లో

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'




- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన



## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

- రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్
- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

**వార్త వేకువ, అమరావతి, ఆగస్టు 16 :** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానిక ంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం - మిగతా 2 లో

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- కేంద్రం పరిశీలనలో రెండో విడత 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టులు
- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు



**వార్త వేకువ, అమరావతి, ఆగస్టు 16 :** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రకృతి చేస్తున్న హెచ్చరిక



వర్తమానంలో లాభార్జన కోసం భవిష్యత్తును బలిపెట్టే నయా ఉదారవాద విధానాలు ప్రపంచాన్ని ప్రమాదపుటంచులకు తీసుకెళ్తున్నాయి. దశాబ్దాలుగా యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియాల్లో చోటుచేసుకుంటున్న కార్చిచ్చుల్ని పట్టించుకుని పర్యావరణ అనుకూల విధానాలు పాటించని ఫలితంగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 37 కోట్ల ఎకరాల్లోని అడవులు, పొదలు తగలబడ్డాయని ఒక అంచనా. ఇలా కార్చిచ్చులో చిక్కుకున్న ప్రాంతం మంగోలియా దేశ విస్తీర్ణానికి సమానమని చెబుతున్నారు. స్పెయిన్, ఫ్రాన్స్ అటవీప్రాంతాల్లో, కెనడా, రష్యాల్లో గత వారం రోజు లుగా వ్యాపిస్తున్న మంటల వల్ల ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఫ్రాన్స్, స్పెయిన్ కార్చిచ్చులైతే ఊహించశక్యం కానంత స్థాయిలో ఉన్నాయి. వాటిని అదుపు చేయగలిగా మని ఆ రెండు దేశాలూ చెబుతున్నా జనంలో భయాందోళనలు ఉపశమించలేదు. నైరుతి ఫ్రాన్స్‌లో పారిస్‌కు నాలుగు రెట్లు పెద్దదైన విస్తీర్ణంలోని అడవి తగలబడటంవల్లగిరోండ్ ప్రాంతంలోని జనావాసాలనుంచి రెండున్నర లక్షలమంది పౌరుల్ని ఆదరా బాదరాగా తరలించాల్సివచ్చింది. ముఖ్యంగా బోర్డావ్ నగరంవైపు ఆ మంటలు వ్యాపిస్తున్న తీరు జనాన్ని హడలెత్తించింది. అటు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ లక్షమందిని తరలించారు. దాని శివారు ప్రాంతాల్లో పలు జనావాసాలు తగలబడిపోయాయి. ఆ రెండూ యుద్ధ రంగాన్ని తలపింపజేస్తున్నాయని మీడియా కథనం. జరగాల్సిన నష్టం జరిగాక మంటల్ని ఏదోమేరకు అదుపు చేయటం సాధ్యమే. కానీ వాటివల్ల వ్యాపించే పొగవల్ల గాలి నాణ్యత దెబ్బతింటుంది. కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లతో కూడిన సూక్ష్మ ధూళి కణాలు పీల్చేగాలిలో వ్యాపించి ఊపిరి తిత్తులు, గుండెసంబంధ వ్యాధులతో ప్రజారోగ్యం క్షీణిస్తుంది. అరుదైన వృక్షసంపద, జీవవైవిధ్యం బుగ్గిపాలవుతుంది. దాని కారణంగా వడగాడ్పులు చెలరేగి జనంఅల్లాడిపోతారు. ఈ ఖండాల్లో ఏటా కార్చిచ్చులవల్ల 3,40,000 అకాల మరణాలుసంభ విస్తున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. 2023లో ప్రపంచ కర్బన ఉద్గారాల్లో కెనడా కార్చిచ్చుల వాటా 23 శాతమని అంచనా వేశారు. యూరప్ ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతున్నదని యూరోపియన్ యూనియన్(ఈయూ) పర్యవేక్షణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఫ్రాన్స్ కార్చిచ్చువల్ల ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాల్లోని పలు ప్రాంతాల్లో పొగ, ధూళితో కూడిన నీటియావిరి వ్యాపించి, అది మేఘాలుగా మారి, ప్రమాదకరమైన పెనుగాలులు, పిడుగుపాట్లు సంభవించాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా ఇలాంటి కార్చిచ్చులు మానవతప్పిదాలతోనే మొదలవుతాయి. కానీ వాతావరణ మార్పుల పర్యవసానంగా అవి వేగంగా విస్తరిస్తాయి. ఈ విషయంలో శాస్త్రవేత్తలు స్థూలంగా అంగీకారానికొచ్చినా, తమ నమూనాలు అందుకోలేనంత స్థాయిలో ఇవి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ తీవ్రతను పసిగట్టడానికి కొత్త ఉపకరణాలు అవసరం కావొచ్చన్నది వారి అభిప్రాయం. ఇప్పుడు స్పెయిన్, ఫ్రాన్సుల్లో మంటలు వ్యాపించిన అడవుల్లో పిక్నిక్‌లు, క్యాంప్ ఫైర్లు ఎక్కువ. అజాగ్రత్తగా ఉండే మనుషులవల్ల నిప్పు రాజుకోవటం, గాలిలో తేమ శాతం తక్కువుండే రాత్రివేళ మోడువారిన చెట్లు, ఎండుటాకులు అంటుకుని మంటలు వేగంగా వ్యాపించడం రివాజు. గత కొన్నేళ్లుగా ఈ కార్చిచ్చులవల్ల ఉత్పత్తయ్యే వేడి, పొగ ఆధారంగా పైరోక్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షరహిత పెనుగాలులతో కూడిన తుపానులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఆ వేడిగాలుల కారణంగా ఎక్కడెక్కడో పడే పిడుగులు మరిన్ని అగ్నిప్రమాదాలకూ, కార్చిచ్చులకూ దారితీస్తున్నాయి. విషపూరిత పొగ, బొగ్గు రేణువులతో ఉండే ఈ మేఘాలు అణు విస్ఫోటంలో వచ్చే పొగ మాదిరే దీర్ఘకాలం వాతావరణంలో అలుముకుని సూర్యరశ్మిని అడ్డుకుంటాయి. 2019--20లో ఆస్ట్రేలియా ఇలాంటి వాతావరణాన్ని చవిచూసింది. దానికి 'బ్లాక్ సమ్మర్' అని పేరుపెట్టారు. ఇకనైనా వాతావరణ ంతో ఆటలాడటం ప్రమాదకరమని ప్రభుత్వాలు గుర్తించాలి. గుప్పెడు కార్పొరేట్ సంస్థల లాభార్జన కోసం వాతావరణాన్ని బలిపెడితే ఊహకందని ఉత్పాతాలు కాటేస్తాయి. పర్యావరణం ధ్వంసమై మానవాళి మనుగడే పెను ప్రమాదంలో పడుతుంది. తాజా పరిణామాలు చేస్తున్న హెచ్చరిక ఇదే.

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది. ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు



రూ.600 కోట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపా దించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'

**మొదటిపేజీ తరువాయి -** తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ



తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్'బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళులు అర్పించిన ముర్ము, మోదీ

**మొదటిపేజీ తరువాయి -** దార్శనికత, నాయకత్వం, సుపరిపాలన, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. "అటల్ బిహారీ తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారు. ఆయన మాటలు, కృషి తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి. ఆయన నాయకత్వం మన దేశాన్ని బలోపేతం చేసింది. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై ఆయనకున్న శ్రద్ధ మనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుంది" అని మోదీ ఎక్స్‌పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా వాజ్‌పేయికి ఘన నివాళులర్పించారు. దేశ సేవకోసం తన జీవితాన్ని అంకితం చేసిన దేశభక్తుడిగా, రాజకీయవేత్తగా వాజ్‌పేయిని గుర్తుచేసుకున్నారు. "మాజీ ప్రధానమంత్రి, బీజేపీ వ్యవస్థాపకుడు, భారతరత్న, పూజ్య అటల్ బిహారీ వాజ్‌పేయి గారి వర్ధంతి సందర్భ ంగా, ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను. వాజ్‌పేయి తన జీవిత ంలోని ప్రతి క్షణాన్ని దేశ సేవకు అంకితం చేసిన అత్యద్భుతమైన దేశభక్త రాజకీయవేత్త. అణు పరీక్షలు, కార్గిల్ యుద్ధం ద్వారా భారతదేశ శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు. అలాగే, విలువలతో కూడిన రాజకీ యాలు అంత్యోదయ, సుపరిపాలన అనే ఆశయాలను తొలిసారిగా క్షేత్రస్థాయికి తీసుకువచ్చారు. ఆయన మహోన్నత వ్యక్తిత్వం, నాయకత్వం ప్రతి బీజేపీ కార్యకర్తను దేశ నిర్మాణం వైపు ఎల్లకాలం ప్రేరేపిస్తూనే ఉంటాయి" అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వాజ్‌పేయికి నివాళులర్పించేందుకు 'సదైవ్ అటల్' వద్ద హాజరయ్యారు. వాక్చాతుర్యం, పార్లమెంటరీ సేవ, రాజనీతిజ్ఞతకు ప్రసిద్ధి చెందిన వాజ్‌పేయి, భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరు. పార్టీ రాజకీయ ప్రస్థానాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో, మౌలిక సదుపాయాలు, దౌత్యం, ఆర్థిక విధానం, జాతీయ భద్రత వంటి రంగాల్లో భారతదేశం అనేక రంగాల్లో పరిణామం చెందింది. వాజ్‌పేయి మూడుసార్లు భారత ప్రధాన మంత్రిగా పనిచేశారు. 1996లో ఆయన తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, అది కేవలం 13 రోజులు మాత్రమే కొనసాగింది. ఆయన 1998 నుంచి 1999 వరకు 11 నెలల పాటు, ఆ తర్వాత 1999 నుంచి 2004 వరకు పూర్తి ఐదేళ్ల పాటు ప్రధానమంత్రిగా పనిచేశారు. వాజ్‌పేయి ఒక ప్రముఖ హిందీ కవి కూడా. ఆయన తన పార్లమెంటరీ జీవితం, ప్రజా జీవితం కారణ ంగా రాజకీయ వర్గాలకు అతీతంగా విస్తృతంగా గౌరవం పొందారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, 2015లో భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ఆయనకు ప్రదానం చేశారు. కాగా, వాజ్‌పేయి 93 ఏళ్ల వయసులో 2018 ఆగస్టు 16న కన్నుమూశారు. ఆయన జీవితం, రాజకీయ సేవ, వారసత్వాన్ని స్మరించుకునే సందర్భంగా ఏటా ఆయన వర్ధంతిని పాటిస్తారు.

## రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క

**మొదటిపేజీ తరువాయి -**

వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఆవిష్కరించిన సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రులతో కలిసి పరిశీలించారు. సీఎం సమక్షంలో కలెక్టర్ హేమంత్ బోర్ఖడే కొత్త కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ హేమంత్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అంతకు ముందు ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు. అనంతరం ఒంటరి మహిళలు, వితంతువుల కోసం ఉద్దేశించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మేడారం వేదికగా ప్రారంభించారు. ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం, పలువురికి కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మేడారం ప్రాంగణంలో మొక్కలు నాటిన రేవంత్ రెడ్డి మహిళలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.

## ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

**మొదటిపేజీ తరువాయి -** మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా-జపాన్-దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్

**మొదటిపేజీ తరువాయి -** నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

**మొదటిపేజీ తరువాయి -**



ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# టీజీపీఎస్సీ కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి -** జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుం దని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ




యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

# విగ్రహా ప్రథమ వార్షికోత్సవం



**డోర్నకల్,ఆగస్టు16 (వార్త వేకువ) :** గౌడ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా, వీరత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సెంటర్(కురవి గేట్) వద్ద ఐక్య గౌడ సంఘాల ఆధ్వర్యం లో కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల ముఖ్య నాయకులు ఐక్య గౌడ సంఘం అధ్యక్షుడు జెర్రీ పోతుల వెంకన్న గౌడ్, ముత్యం వెంకన్న గౌడ్, పెద్ది వెంకన్న గౌడ్,గునిగంటి కమలాకర్ గౌడ్, చిత్తనూరి శ్రీనివాస్ గౌడ్, బిక్కి వెంకటేశర్లు గౌడ్, గండి వీరేందర్ గౌడ్,ముంజాల రాజేందర్ గౌడ్, మండ విక్రమ్ గౌడ్,బండి దీపక్ గౌడ్, ,గడ్డంవిజయ్ గౌడ్, గడ్డం సమ్మయ్య గౌడ్,లింగాల వీరభద్రం గౌడ్, రమేష్ గౌడ్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు చదువులలో క్రీడాలలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

## మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ



**భద్రాద్రి జిల్లా ఆగస్టు 16 (వార్త వేకువ) :** భద్రాచలం పట్టణంలోని పాఠశాలలో, జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ కృష్ణ, అన్నారు. విద్య అనేది జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధమని, సంపాదించిన ఆస్తి కంటే విద్య ద్వారా పొందిన జ్ఞానం శాశ్వత సంపద అని పేర్కొన్నారు. ఈ రోజు విద్యార్థులు చేసే కృషే వారి రేపటి విజయానికి బాటలు వేస్తుందని అన్నారు.భద్రాచలం ప్రాంతం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి నిలయమని పేర్కొంటూ, ఆ విలువలను కాపాడుకుంటూనే ఆధునిక విద్యను అభ్యసించి గ్రామానికి, కుటుంబానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తన జీవితానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. డాక్టర్, ఇంజనీర్, ఉపాధ్యాయుడు, పోలీసు అధికారి, సైనికుడు, న్యాయవాది, శాస్త్రవేత్త లేదా ప్రజాసేవకుడు కావాలన్నా నిరంతర శ్రమ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అవసరమని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఐదు ముఖ్యమైన సూచనలు చేశారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదవాలని, ఉపాధ్యాయులను గౌరవిస్తూ తల్లిదండ్రులను ఆదరించాలని, మంచి స్నేహితులను ఎంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు పాఠశాల పరిశుభ్రతను పాటించాలని, మొబైల్ ఫోన్‌ను అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించి ఎక్కువ సమయాన్ని చదువుకు కేటాయించాలని, సర్పంచ్ కృష్ణ విద్యార్థులకు, సూచించారు. మీరు ఈ గ్రామ భవిష్యత్తు... మీ విజయం మన గ్రామ విజయం. మీలో నుంచి రేపటి కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులు, వైద్యులు, శాస్త్రవేత్తలు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు ఎదగాలని నేను హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను" అని సర్పంచ్ పూనేం,కృష్ణ,అన్నారు.గ్రామపంచాయతీ తరపున పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి

## మండల ఎంపీడీవో ముత్యాలరావు




**భద్రాద్రి జిల్లా ఆగస్టు 16 (వార్త వేకువ) :** అశ్వాపురం మండల ప్రజల సమస్యలను స్థానిక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, అధ్యక్షతన, త్వరితగతన, పరిష్కరిం చేందుకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జీవో ఎంఎస్, నెంబర్, 4 మేరకు ప్రతి సోమవారం 'ప్రజావాణి' కార్య్ర కమాన్ని,నిర్వహించనున్నట్లు, అశ్వాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముత్యాలరావు, తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఎంపీడీవో, సమావేశ,కార్యాలయంలో, ప్రజావాణి,నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజావాణి, ముఖ్యఅంశాలు:-1. వినతుల స్వీకరణ:- ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు మరియు దరఖాస్తులను నేరుగా సమర్పించవచ్చు.2. అధికారుల హాజరు:- మండల స్థాయికి చెందిన అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై వినతులను స్వీకరిస్తారు.3. సమర్థవంతమైన పరిష్కారం:- స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి నిబంధనలలో, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ, మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత సమయంలో తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను సమర్పించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ని మర్యాదపూర్వకంగా కలిసిన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు ఆగస్టు 16 (వార్త వేకువ) :** బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాసేవకులు పోతురెడ్డి వెంకటేశ్వర రెడ్డి కుమారుడి వివాహము సందర్భంగా అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ని నేడు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ ఆహ్వాన పత్రికను అందజేసిన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మరియు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇంగువ రమేష్, బాదం రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణసాగర్ పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ

## సర్పంచ్ తాటి వాణి ఆధ్వర్యంలో



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు ఆగస్టు 16 (వార్త వేకువ) :** కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ తాటి వాణి అధ్యక్షతన పాఠశాల విద్యార్థు లకు షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొని పాఠశాల విద్యార్థులకు షూస్ అందజేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి అవ సరమైన సహకారం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపుతూ, వారి అవసరాలను గుర్తించి సహాయం అందిస్తున్న సర్పంచ్ తాటి వాణి కి, పాలకవర్గ సభ్య లకు పాఠశాల ఉపాధ్యాయులు వంక రంగారావు మరియు విద్యార్థులు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టాలని మన స్ఫూర్తిగా కోరు కుంటున్నాను . ఈ ఊరు బాగుండాలని వీదూలన్నీ శుభ్రంగా ఉండాలని ఏదైనా కష్టాలు వస్తే నాకు వచ్చి చెప్పాల్సిందిగా కోరుకుంటున్నాను. వీధిలైట్లు వెలగకపోతే చెప్పాలని అందర్నీ వేడు కుంటున్నాను. స్కూల్ పిల్లలు అందరు మంచిగా చదువుకోవాలని కోరుకుంటున్నాను. ఈ కార్య క్రమానికి సర్పంచ్ తాటి వాణి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పిల్లలు తది తరులు పాల్గొన్నారు.

# మీర్‌పేట్‌లో ఇంట్లో చోరీ.. 3.5 తులాల బంగారం అపహరణ



**బడంగ్పేట్ ఆగస్టు16(వార్త వేకువ) :** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ విశాఖ నగర్‌లో ఇంట్లో చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ నగర్ రోడ్ నంబర్--2కు చెందిన 42 ఏళ్ల రామలింగం కుటుంబ సభ్యులతో కలిసి ఆగస్టు 15న సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి సుమారు 11:50 గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన సమయంలో తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి దుండగులు చొరబడినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు, లోపల పరిశీలించగా సుమారు 3.5 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీ జరిగిన తీరును, ఇంటి పరిసరాలను పరిశీలించి వివరాలను సేకరించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. చోరీకి పాల్పడిన వ్యక్తులు ఎవరు? వారు ఇంట్లోకి ఎలా ప్రవేశించారు.అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం తెలియాల్సి ఉంది.

# అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్.ఎల్.ఎ















**ఎల్ బి నగర్ నియోజకవర్గం, ఆగస్టు 16(వార్త వేకువ) :** బోనాల పండుగ నేపథ్యంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాల్లో ఉన్న అమ్మవార్లను దర్శించుకున్నారు.





**ఎల్ బి నగర్ నియోజకవర్గం ఆగస్టు 16 (వార్త వేకువ) :** బోనాల పండుగ సందర్భంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీ నందు బోనాలు ఎత్తిన చిన్నారులు.

# మేడారంలో,సమ్మక్క,సారలమ్మ,వన దేవతలను దర్శించి మొక్కులు చెల్లించిన సీఎం రేవంత్ రెడ్డి





**భద్రాద్రి జిల్లా ఆగస్టు 16 (వార్త వేకువ) :** తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవతలు సమ్మక్క--సారలమ్మ తల్లుల గద్దెలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, నియోజకవర్గాల ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులతో కలిసి దర్శించుకున్నారు. తొలుత తులాభారంలో వనదేవతలు,సమ్మక్క--సారలమ్మ తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ,సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సీఎం,రేవంత్,రెడ్డి,ఆకాంక్షించారు.అనంతరం మేడారంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న మౌలిక వసతుల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మేడారంలో నూతన ఆర్వో, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా మేడారానికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. మేడారం అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, భక్తులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సీఎం సమీక్షించారు. మేడారం మహాజాతర ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు అవసరమైన రహదారులు, తాగునీరు, పారిశు ధ్యం తదితర సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ టిపిసిసి, అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, వేం నరేందర్ రెడ్డి, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం, వెంకట్రావు, ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, లు, మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.,వనదేవతలు సమ్మక్క--సారలమ్మ తల్లుల ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక · నిజం వైపు నిరంతరం...
సోమవారం 17 - 08 - 2026

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- ఆగస్టు 17వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ
- సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..
- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనేశీయిఎ.ఖజా.గ్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.ఆగస్టు 17వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ ఆగస్టు 17వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# 19న కదిరిలో గిరిప్రదక్షిణ

**స్వాతి నక్షత్రం సందర్భంగా స్తోత్రాద్రి గిరిప్రదక్షిణ**

**ఆలయం వద్ద హారతి అనంతరం ప్రారంభం..భక్తులకు మహా ప్రసాద వితరణ**

**పర్యావరణ పరిరక్షణకు స్టీల్ ప్లేట్లు**



**కదిరి :** కదిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ఈ నెల 19న స్తోత్రాద్రి గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి గిరిప్రదక్షిణ కార్యక్రమం ప్రారంభం కానుంది.ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో స్వామివారి ఆలయం వద్ద హారతి కార్యక్రమం అనంతరం గిరిప్రదక్షిణను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. గిరిప్రదక్షిణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తుల కోసం మహా ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రసాద వితరణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ ప్లేట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు ప్రసాదం స్వీకరించిన అనంతరం స్టీల్ ప్లేట్లను శుభ్రపరిచి తిరిగి నిర్ణీత ప్రదేశంలో ఉంచాలని కోరారు.భక్తులంతా సహకరించి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్‌ను 'దిమాగీ నక్సల్స్ కాంగ్రెస్ పార్టీ'గా మార్చుకోండి

**వందేమాతరాన్ని అవమానించిన కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి: బీజేపీ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి**



**పుట్టపర్తి :** కాంగ్రెస్ పార్టీపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పుట్టపర్తిలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకుని 'దిమాగీ నక్సల్స్ కాంగ్రెస్ పార్టీ'గా పేరు మార్చుకోవాలని ఎద్దేవా చేశారు.చిదంబరం వ్యాఖ్యలతో కాంగ్రెస్ వైఖరి బహిర్గతం పారామిలటరీ దళాలు, గిరిజనులను బలితీసుకున్న నక్సలిజాన్ని సమర్థించేలా కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం చేసిన 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అసలు వైఖరిని బయటపెట్టాయని ఆరోపించారు.దేశ భద్రత, అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని కాంగ్రెస్ పార్టీ పదేపదే విమర్శిస్తోందని ఆయన ఆరోపించారు. భారత అణు కార్యక్రమం, రక్షణ రంగం, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ వంటి అంశాలపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు.దేశ ప్రగతిని అడ్డుకునే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలిఅణు, రక్షణ రంగాల్లో దేశం సాధిస్తున్న పురోగతిని వ్యతిరేకించడం, యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఎగతాళి చేయడం, 'కాషాయ ఉగ్రవాదం' వంటి పదాలను ఉపయోగించడం కాంగ్రెస్ పార్టీ మేధో నక్సలిజానికి నిదర్శనమని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు.మోదీ ప్రభుత్వ హయాంలో తుపాకీ పట్టిన నక్సలిజం క్రమంగా అంతమవుతున్న సమయంలో 'అర్బన్ నక్సల్స్'కు, దేశ విచ్ఛిన్నకర శక్తులకు రాజకీయ, మేధో రక్షణ కల్పించే ప్రయత్నాలు చేయడం విచారకరమన్నారు. దేశ ప్రగతిని అడ్డుకోవాలని, వ్యూహాత్మక భద్రతను దెబ్బతీయాలని చూసే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని ఆయన కోరారు.వందేమాతరంపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించిన బీజేపీ నేతస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నేతల వ్యవహారశైలిని కూడా విష్ణువర్ధన్ రెడ్డి తప్పుబట్టారు. వందేమాతరాన్ని అవమానించిన సోనియా గాంధీ వైఖరి ద్వారా కాంగ్రెస్ పార్టీకి దేశం పట్ల ఉన్న గౌరవం మరోసారి స్పష్టమైందని ఆయన విమర్శించారు.జాతీయ గౌరవం, దేశభక్తి, దేశ ప్రగతి వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని దేశ ప్రజలు, ముఖ్యంగా యువత గమనిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు, యువత కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టి సమాధానం ఇస్తారని పేర్కొన్నారు.వందేమాతరాన్ని అవమానించినందుకు కాంగ్రెస్ పార్టీ తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# నేను నిధులు సమకూరుస్తా: కదిరి ఎమ్మెల్యే

**ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకారం**

**పేదలకు మెరుగైన వైద్యం అందించాలి..రోగులకు అన్న ప్రసాదం అందించే యోచన**




**కదిరి :** కదిరి ప్రభుత్వ వైద్యశాలను మరింత అభివృద్ధి చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్‌తో ఆసుపత్రిలోని పలు అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. వైద్యుల పనితీరు మరింత మెరుగుపడాలని, రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.నిధులు సమకూర్చడం నా బాధ్యతఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడం తన వంతు బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. అయితే పేదలకు నాణ్యమైన వైద్యం అందించే బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారితో వచ్చే సహాయకులకు భోజన వసతి కల్పించే అంశంపై కూడా ఎమ్మెల్యే చర్చించారు. ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానం ద్వారా ఆసుపత్రిలోని రోగులు, సహాయకులకు భోజనం అందించే అవకాశాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పేద రోగులకు వైద్యంతో పాటు భోజన సదుపాయం కూడా అందితే వారికి మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.సమీక్షలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్లు ఐక్యంగా ఉండాలి

**నూతన అధ్యక్షులు భాషాజాన్ పిలుపు**



**తాడిపత్రి :** తాడిపత్రి ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అండ్ రేడియోలాజికల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి తాడిపత్రి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోలాజికల్ టెక్నీషియన్లు హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షులు భాషాజాన్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవడంతో పాటు, టెక్నీషియన్ల సంక్షేమం, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమైందని, రోగ నిర్ధారణలో వైద్యులకు అవసరమైన కీలక సమాచారాన్ని అందించడంలో వారు బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రోగుల పట్ల బాధ్యత, నాణ్యమైన సేవలు, వృత్తిపరమైన నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు.అసోసియేషన్ సభ్యుల మధ్య పరస్పర సహకారం, సోదరభావం పెంపొందించుకోవడంతో పాటు, కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భాషాజాన్ తెలిపారు.అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి సభ్యుడు భాగస్వామి కావాలని, ఎలాంటి సమస్య ఎదురైనా సంఘం దృష్టికి తీసుకువస్తే అందరం కలిసి పరిష్కరించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ నూతన అధ్యక్షులు భాషాజాన్ నాయకత్వంలో అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం సభ్యులు ఆత్మీయంగా కలుసుకుని సంఘం భవిష్యత్ కార్యక్రమాలు, సభ్యుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

# ఎర్రవంకపల్లిలో తాగునీటి కష్టాలు

**ఐదు నెలలుగా నీటి కోసం అవస్థలు.. ఖాళీ బిందెలతో మహిళల నిరసన**

**బోర్లకు మరమ్మతులు చేయాలి**



**నల్లమాడ :** నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.గ్రామంలోని పంచాయతీ బోర్ల నుంచి నీరు సక్రమంగా రావడం లేదని మహిళలు తెలిపారు. దీంతో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, రోజువారీ అవసరాలకు కూడా నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.గ్రామంలో చెడిపోయిన బోర్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరారు. అలాగే గ్రామంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు కొత్తగా రెండు బోర్లు మంజూరు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.కొత్త బోర్లు ఏర్పాటు చేసే వరకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేయాలని మహిళలు కోరారు. వేసవి కాలం ముగిసినా ఐదు నెలలుగా సమస్య కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# ఎన్‌పీ కుంటలో స్థలాలు కొనవద్దు..!

**అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు.. నిర్వాహకులకు నోటీసులు**



**ఎన్‌పీ కుంట :** ఎన్‌పీ కుంట ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల సమీపంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని డిప్యూటీ ఎంపీడీవో ప్రజలకు సూచించారు. సంబంధిత అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్ పనులు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.అనుమతులు లేకుండా పనులు.. పోలీసులకు ఫిర్యాదునిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ పనులు కొనసాగిస్తున్న నిర్వాహకులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. అధికారుల సూచనలు, నిబంధనలు పట్టించుకోకుండా పనులు కొనసాగించడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.ప్రభుత్వ అనుమతులు, సంబంధిత శాఖల క్లియరెన్సులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో స్థలాలు కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందులు పడకూడదని అధికారులు హెచ్చరించారు. అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.నిబంధనలకు విరుద్ధంగా పనులు కొనసాగించినా, అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేసినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, స్థలాలు కొనుగోలు చేసే ముందు సంబంధిత అధికారుల నుంచి అనుమతుల వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు.

# 55 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు గ్రీన్ సిగ్నల్

**యర్రగొండపాలెం మండలంలో భర్తీ.. 21లోగా దరఖాస్తులు**

**ఎస్‌జీటీకి రూ.10 వేలు.. ఎస్‌ఏలకు రూ.12,500 గౌరవ వేతనం**

**మండల విద్యాశాఖ అధికారి పి. ఆంజనేయులు మల్లు నాయక్**



**ఎర్రగొండపాలెం :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం 55 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను మంజూరు చేసింది. ఈ విషయాన్ని మండల విద్యాశాఖాధికారులు పి. ఆంజనేయులు, ఎస్. మల్లు నాయక్ శనివారం వెల్లడించారు.మంజూరైన పోస్టుల్లో 38 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), 17 స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఎంపికైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను 8 నెలల పాటు పాఠశాలల్లో నియమించనున్నారు. ఎస్‌జీటీ స్థాయి వారికి నెలకు రూ.10 వేల, స్కూల్ అసిస్టెంట్ స్థాయి వారికి రూ.12,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు వివరించారు.అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత మండల విద్యాశాఖాధికారుల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ నియామకాలతో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

**రైతు, విద్య, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి: సీపీఐ**



**నల్లమాడ :** రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ మేరకు ఆదివారం నల్లమాడలో 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటరమణ, చంద్ర, గంగాధర్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలివివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు.

# వై .పాలెం లో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించిన

**గూడూరి ఎరిక్షన్ బాబు**

**యువతలో క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు .....డాక్టర్ షేక్ ఇస్మాయిల్**



**ఎర్రగొండపాలెం :** ఎర్రగొండపాలెం పట్టణ ముస్లిం యూత్ సొసైటీ వారి 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ యువతలోని క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం జరిగింది.ఎర్రగొండపాలెం పట్టణంలోని పుల్లల చెరువు రోడ్డులో గల బృందావనం గార్డెన్ నందు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు హాజరై క్రీడా, పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా నైపుణ్యాన్నివెలికి తీసేందుకు క్రికెట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని,క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి మంచి ఆరోగ్యానికి ఉపయోగపడతాయని, క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని తీసుకొని ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక వాతావరణం లో క్రీడల్లో పాల్గొనాలని తెలియజేశారు క్రికెట్ పోటీలను నిర్వహించిన ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి, సీఐ అజయ్ కుమార్ , ఎస్సై దేవకుమార్ , మంత్రు నాయక్ , సత్యనారాయణ గౌడ్ , తోట మహేష్ నాయుడు ,కొత్త మాస సుబ్రహ్మణ్యం , టిడిపి నాయకులు మరియు ముస్లిం యూత్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించాలి

**భారీ శబ్దాలతో డీజేలు వాడొద్దు.. పోలీసుల నిబంధనలు పాటించాలి: ఎస్పీ సతీశ్ కుమార్**

**ఇతరుల మనోభావాలను గౌరవించాలి..నిర్ణీత సమయాల్లోనే ఊరేగింపులు**



**శ్రీసత్యసాయి :** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ ప్రజలకు సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాలు, ఊరేగింపుల సమయంలో భారీ శబ్దాలతో డీజేలు వినియోగించడం వల్ల వృద్ధులు, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల చదువులకు కూడా ఆటంకం కలుగుతుందని తెలిపారు.వినాయక చవితి వేడుకలను నిర్వహించుకునే సమయంలో ఇతర మతాల వారి మనోభావాలను గౌరవించాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ, సామరస్యపూర్వక వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు.వినాయక విగ్రహాల ఊరేగింపులను పోలీసు శాఖ నిర్దేశించిన మార్గాలు, సమయాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఎస్పీ సతీశ్ కుమార్ ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని, భక్తి, భద్రత, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యతనిస్తూ వినాయక చవితిని విజయవంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు.

# ఖాద్రి లక్ష్మీనరసింహ ఆలయంలో భక్తుల సందడి

**శ్రావణమాసం తొలి శనివారం ప్రత్యేక పూజలు**



**కదిరి :** కదిరి పట్టణంలోని ప్రసిద్ధ శ్రీమత్ ఖాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.స్వామివారి దర్శనం కోసం కదిరితో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.శ్రావణమాసం సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**ఎర్రగొండపాలెం :** దోర్నాల మండలంలోని తూర్పు బొమ్మలాపురం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు పాపయ్య కుమారుడు వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల అధ్యక్షులు మరియు గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కాపురం జనసేన పార్టీ నాయకులు.... ఇమ్మడి కాశీనాథ్



**ఎర్రగొండపాలెం :** త్రిపురాంతకం మండలం లోని కేసినేనిపల్లి గ్రామం నందు జనసేన పార్టీ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు కుమారుడు వివాహ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం జనసేన పార్టీ నాయకులు ఉమ్మడి కాశీనాథ్ పాల్గొన్నారు.ఇమ్మడి కాశీనాథ్ నూతన వధువు వరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పిల్లాపాపలతో కలకాలం చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు, శిరిగిరి శ్రీనివాసరావు, తిరుపతయ్య, భీమిశెట్టి వెంకటేశ్వర్లు, ఇ.శ్రీనివాసులు మరియు జనసేన పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
సోమవారం 16 - 08 - 2026

# ఓటర్ల ఇంటి బాటలో రాజకీయ పార్టీలు ఏఎస్‌డీడీ ఓట్లపై ఆరా

**జాబితా తీసుకుని ఇంటింటికి వెళ్లి విచారణకు సిద్ధం**

**ఫారం-6 ద్వారా తిరిగి నమోదు చేయించాలని నిర్ణయం**

**ఓటర్లను అకారణంగా ఏఎస్ డీడీలో పెడితే చట్ట ప్రకారం**

**కేసులు పెడతామని నేతల వార్నింగ్**



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్)తో రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల లెక్క తేల్చారు. భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతు కానుండటంతో రాజకీయ పార్టీల్లో చర్చలు మొదలయ్యాయి. అన్‌కలెక్టబుల్ ఓటర్ల జాబితాను మరోసారి పరశీలించేందుకు నాయకులు దృష్టి సారించాయి. ఎన్నికల అధికారులు మొత్తం రూ.3.38 కోట్ల ఓటర్లలో 73.30 లక్షల మందిని ఏఎస్‌డీడీ (ఆచూకీ లేనివారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, మృతి చెందిన వారు, డూప్లికేట్) విభాగాల కింద అన్‌కలెక్టబుల్ చేర్చారు. ఇందులో శాశ్వతంగా వలస వెళ్లిన వారివి 45,18,981, చనిపోయిన వారివి 9,22,230, ఆచూకీ లేనివారీ ఓట్లు 11,25,546, డూప్లికెట్ ఓట్లు 6,70,203, ఇతర కారణాల ఓట్లు 1,02,294 ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఓటర్లకు డిజిటలైజేషన్ కాకపోవడంతో ముసాయిదా జాబితాలో ఓట్లు ఉండవు. వీరిని తొలగించిన ఓట్ల కింద గుర్తిస్తారు. ఈ మేరకు రాష్ట్రంలో పెద్దఎత్తున ఓట్లు ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు వీటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. నియోజకవర్గాల వారీగా ఏఎస్‌డీడీ ఓట్ల వివరాలను రాజకీయ పార్టీలకు అందించడానికి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లిస్ట్ ప్రకారం ఆ ఓటర్ల ఇంటి బాట పట్టడానికి ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. అకారణంగా పెట్టారంటూ ప్రస్తుతం ఓ ప్రధాన రాజకీయ పార్టీ నియోజకవర్గాల వారీగా ఏఎస్‌డీడీ జాబితా తీసుకుని ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి విచారణ చేపడుతోంది. మరి నిజంగానే ఆ ఓటరు ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నారా స్థానికంగా ఓటరు ఉంటే ఎందుకు జాబితాలో ఉంచారు అనే వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతోంది. చాలా చోట్ల ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయలేదని, వీటిని ఏఎస్‌డీడీ జాబితాలో పెట్టినట్లు అనుమానాలు ఉన్నాయని, ఇంటింటికి వెళ్లి తమ పార్టీ విచారణకు సిద్ధమవుతోందని ఓ పార్టీ నేత తెలిపారు. ఇందులో పెద్దఎత్తున ఓటర్లను అకారణంగా ఏఎస్‌డీడీలో పెడితే చట్ట ప్రకారం అధికారులపై కేసులు పెడతామని ఆ నేత వెల్లడించారు. ఓటు లభించేలా ప్రణాళికలు రూపొందన ప్రధాన రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం నిజంగానే స్థానికంగా ఓటర్లు ఉంటే వారికి తిరిగి ఓటు వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏఎస్‌డీడీ జాబితాలోని ఓట్లు తిరిగి పొందే అవకాశం లేకపోవడంతో ఫారం-6 ద్వారా మళ్లీ కొత్తగా ఓటు నమోదు చేయించాలనిం నిర్ణయించారు. ఈనెల 17న ముసాయిదా జాబితా విడుదల చేయించేలా దృష్టి పెట్టారు. అందుకు కావాల్సిన పత్రాలు, ఎస్ఐఆర్-2002 వివరాలను కూడా ఇప్పుడే సేకరించి దగ్గర పెట్టుకున్నారు. కొత్త ఓటర్లకు అవకాశం ప్రతి ఏటా జనవరిలో ప్రత్యేక రివిజన్ కార్యక్రమం అమలు చేస్తారు. 18 ఏళ్లు నిండిన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ, తప్పుల సవరణ, మృతుల గుర్తింపు, తదితరాలు చేసేవారు. సర్ నేపథ్యంలో ప్రత్యేక రివిజన్ జరగలేదు. తాజాగా కొత్త ఓటర్ల స్వీకరణకు అవకాశం ఉండడంతో పదివేల వరకు ఓటర్లు పెరగవచ్చని భావిస్తున్నారు. సర్ పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఓట్లు ఉంటాయా పోతాయా అనే భయం ఓ వైపు, సర్ పేరుతో ఓటర్లకు మోసపూరిత ఎస్సెమ్మెస్‌లు, కాల్స్ మరోవైపు . వాట్సప్‌లో పంపించే లింక్ ద్వారా ఫారం నింపాలంటూ సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడుతున్నారు. అలాంటి కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ సూచించారు. ఎన్యుమరేషన్ ఫారం, ఎన్నికల గుర్తింపు కార్డు రిజెక్ట్ అయినట్లు కొందరికి ఈ మెసేజ్‌లు వస్తున్నాయి. ఎన్యుమరేషన్ ఫారంలో వివరాలు సరిగా లేవని, వాట్సప్‌లో పంపించే లింక్ ద్వారా ఫారం నింపాలంటూ సైబర్ నేరగాళ్లు పేర్కొంటున్నారు. నెట్ వివరాలు, పాస్‌వర్డ్, సీవీవీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలు అడుగుతున్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు.

# కాలువలోకి దూసుకెళ్లిన కారు నలుగురు యువకులు గల్లంతు

**పశ్చిమ గోదావరి జిల్లాలో అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన కారు**

**ఐదుగురు యువకులు గల్లంతు ఓగిడి గ్రామం నుంచి తూర్పుగోదావరి జిల్లా మోరి వెళ్తుండగా ప్రమాదం**



పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఒక ఘోర ప్రమాదం జరిగింది. ఇరగవరం మండలం ఐతంపూడి లాకుల మలుపు వద్ద వేగంగా వస్తున్న ఒక కారు నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా నలుగురు యువకులు నీటి ప్రవాహంలో గల్లంతు కాగా, ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు. అదుపుతప్పిన కారు ఇరగవరం మండలం ఐతంపూడి వద్ద కారు అదుపుతప్పి కాలువలోనికి దూసుకుపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. మరొకరు స్థానికుల సహాయంతో సురక్షితంగా బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా మోరి, పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామాలకు చెందిన ఐదుగురు యువకులు స్నేహితుని పెళ్లి కోసం పెరవలి వచ్చారు. తిరిగి ప్రయాణంలో ఓగిడి గ్రామంలో స్నేహితుని కలవడానికి బయల్దేరారు. ఈ క్రమంలో వర్షం కురుస్తుండటంతో దారి కనిపించక, కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. నలుగురు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు ఓ యువకుడు చెట్టుకొమ్మను పట్టుకొని స్థానికుల సహకారంతో బయటపడ్డాడు. అక్కడే ఉన్న స్థానికులు ట్రాక్టర్ సహకారంతో కారును బయటికి తీశారు. ప్రమాదం నుంచి బయటపడిన సంతోష్ నలుగురికి కాల్ చేసినప్పటికీ ఫోన్లు పనిచేయలేదు. గల్లంతయిన వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో గల్లంతు ఈ ఘటనలో ప్రాణాలను కాపాడుకునే క్రమంలో కారులోంచి బయటికి వచ్చిన నలుగురు ప్రవాహ వేగానికి కొట్టుకొని పోయారు. ఒకరు మాత్రం ప్రవాహంలో దొరికిన చెట్టుకొమ్మను పట్టుకొని స్థానికుల సహకారంతో బయటపడ్డారు. మట్టా సంతోష్ ప్రమాదం నుంచి బయటపడగా పోతుల లక్ష్మీభాను(18), రాజారాం (17), నాగిరెడ్డి దుస్వంత(18) నాగ బత్తుల సాయి సూర్య (19) గల్లంతయ్యారు. ట్రాక్టర్ సహకారంతో కారును బయటికి తీశారు. ప్రమాదం నుంచి బయటపడిన సంతోష్ సహకారంతో నలుగురికి ఫోన్లు చేసినప్పటికీ ఫోన్లు పనిచేయకపోవడంతో గల్లంతయ్యారని పోలీసులు భావించారు. "ఒక పెళ్లి నుంచి తిరిగి వస్తూ, మరో స్నేహితుడిని కలవడానికి ప్రయత్నిస్తుండగా, డ్రైవర్ దారి తప్పిపోయాడు. కారు అదుపుతప్పి ఒక కాలువలో పడిపోయింది. తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో, కారులో ఉన్న మిగతా నలుగురు బయటకు వచ్చి అవతలి ఒడ్డుకు ఈదగలిగారు. లోపల చివరిగా మిగిలింది నేనే. నేను కారు పైకప్పు మీదకు ఎక్కి సహాయం కోసం గట్టిగా అరిచాను. అటుగా మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు నన్ను రక్షించడానికి ప్రయత్నించారు కానీ విఫలమయ్యారు. చివరికి, దగ్గరలో ఉన్న ఒక కొమ్మను పట్టుకుని నేను కాలువ నుంచి ఈదుకుంటూ బయటకు రాగలిగాను. ప్రమాదం జరిగినప్పుడు కారులో మేము ఐదుగురం ఉన్నాము. మిగిలిన వారు ప్రవాహంలో కొట్టుకుపోయారు. నీటిలో మునిగిపోయిన కారును తర్వాత ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు" మట్టా సంతోష్, ప్రమాదం నుంచి బయటపడిన వ్యక్తి

# మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచే ప్రారంభం

**16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఫ్లాట్లకు ముగిసిన అర్జీల గడువు**

**అత్యధికంగా కూకట్‌పల్లిలో 9,208 మంది దరఖాస్తు**

**నేటి నుంచి ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్,**

**చంద్రాయణగుట్టలో దరఖాస్తుల స్వీకరణ**

హైదరాబాద్ కోర్ అర్బన్‌లోని మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లకు వచ్చేనెల 3 వరకు మీసేవ ద్వారా దరఖాసులు చేసుకోవాలని హౌసింగ్‌బోర్డు ప్రకటించింది. ఇప్పటికే క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో 7,340 ఎల్ఐజీ ఫ్లాట్లకు 60,014 మంది దరఖాస్తు చేశారు. ఈ నెల 20 తర్వాత లాటరీ ద్వారా ఫ్లాట్లు కేటాయించనున్నట్లు హౌసింగ్‌బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. క్యూర్ పరిధిలో ముగిసిన దరఖాస్తుల గడువు :హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 60,014 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కోఫ్లాట్‌కి 8 మందికి పైగా పోటీపడుతున్నారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,340 ఎల్ఐజీ ఫ్లాట్లకు దరఖాస్తుల గడువు శనివారంతో ముగిసింది. అత్యధికంగా కూకట్‌పల్లిలో 9,208 మంది దరఖాస్తు చేసుకోగా కుత్బుల్లాపూర్‌లో 7,210 ఖైరతాబాద్‌లో 6,970, నాంపల్లిలో 5,114, శేరిలింగంపల్లిలో 4,860 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్యూర్ పరిధిలో ముగిసిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు అంబర్‌పేట 3,893, బహదూర్‌పురాలో 2, 281, ఇబ్రహీంపట్నంలో 1398, కార్వాన్‌లో 2,773 మంది దరఖాస్తు చేసుకున్నారు. మలక్ పేట 4, 459, మల్కాజిగిరిలో 1717, మేడ్చల్‌లో 2,155, రాజేంద్రనగర్‌లో 2 ,723, సనత్‌నగర్‌లో 1,861, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 2,326, మహేశ్వరంలో1066 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి అర్హులకు ఈ నెల 20 తర్వాత లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. క్యూర్ పరిధిలోని ఎల్ఐజీ ఫ్లాట్ల కోసం ప్రభుత్వం రూ.807 కోట్లు కేటాయించింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సెప్టెంబరు 3 వరకు మీసేవలో దరఖాస్తుల ఆహ్వానం క్యూర్ పరిధిలోని మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలాలు గుర్తించిన హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చంద్రాయణ గుట్ట నియోజకవర్గాల్లోని అల్పాదాయ వర్గాలకి నేటి నుంచి సెప్టెంబరు 3 వరకు మీసేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. నివసిస్తున్న నియోజకవర్గం పరిధిలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం వారికి హయత్‌నగర్ సమీపంలో అమ్మంగల్, గోషామహల్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు జమిస్తాన్‌పూర్ చంద్రాయణగుట్ట వాసులకు ఫలక్‌నుమా సమీపంలోని బండ్లగూడలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించాలని నిర్ణయించారు. పదేళ్ల పాటు అమ్మడానికి, కిరాయి



ఇవ్వడానికి వీల్లేదు ఒక్కో నియోజకవర్గంలో 480 చొప్పున 1920 ఫ్లాట్లు నిర్మించనున్నారు. పదంతస్తుల టవర్‌లో ఒక్కో అంతస్తుకు 12 ఫ్లాట్ల చొప్పున 528 చదరపు అడుగు బిల్టప్ ఏరియా 400 ఎస్ఎఫ్‌టీ కార్పెట్ ఏరియాతో సింగిల్ బెడ్ రూమ్‌లు నిర్మించనున్నారు. స్థలం, రూ.5 లక్షల సబ్సిడీని ప్రభుత్వం ఇవ్వనుండగా సుమారు 6 లక్షలు లబ్దిదారుల నాలుగు విడతల్లో తమ వాటాగా చెల్లించాలి. దరఖాస్తుతో పాటు రూ.10,000 ఈఎండీ చెల్లించాలి. ఇళ్లు దక్కకపోతే ఈఎండీ తిరిగి చెల్లిస్తామని హౌసింగ్ బోర్డు వైస్ గౌతమ్ చెప్పారు. కేటాయించిన ఎల్ఐజీ ఫ్లాటును పదేళ్లపాటు అమ్మడానికి లేదా కిరాయి ఇవ్వడానికి వీల్లేదని షరతు విధించింది. ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంచేశారు. ఫ్లాటును ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని అవసరమైతే బ్యాంకు మార్టిగేజ్ చేసుకోవచ్చునని హౌసింగ్ బోర్డు పేర్కొంది.

# హైదరాబాద్ అమరావతి పక్కపక్కనే హైస్పీడ్ రైల్ 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే

**హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు, ఫ్యూచర్ సిటీ-బందరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం . రెండు ప్రాజెక్టులు**

**ఒకదానికొకటి సమాంతరంగా నిర్మాణం . రెండు మార్గాలకు కలిపి ఒకేసారి భూసేకరణ**

**చేపట్టేందుకు ప్రణాళిక . ఫ్యూచర్ సిటీ, అమరావతి, బందరు పోర్టు మధ్య కనెక్టివిటీ బలోపేతం**

**ఎడమవైపు రోడ్డు, కుడివైపు రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు**



హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, బందరు పోర్టులను అనుసంధానించేలా రెండు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సమాంతరంగా పరుగులు పెట్టనున్నాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్వే లైన్, ఫ్యూచర్ సిటీ-బందరు పోర్టు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను పక్కపక్కనే నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా అంగీకరించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, హైదరాబాద్-విజయవాడ ప్రస్తుత జాతీయ రహదారికి ఎడమవైపు ఎక్స్‌ప్రెస్‌వే, కుడివైపు హైస్పీడ్ రైలు మార్గం ఉండేలా అలైన్‌మెంట్ ఖరారు చేశారు. 760 కిలోమీటర్ల హైస్పీడ్ రైలు మార్గం హైదరాబాద్-అమరావతి-చెన్నై మధ్య ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైల్వే కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు. ఇందులో తెలంగాణ పరిధిలో 180 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగనుంది. ఈ మార్గంలో శంషాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ, డ్రై పోర్టు, నాగార్జునసాగర్ (హాలియా), వాడపల్లి వద్ద స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2.24 లక్షల కోట్లు కాగా, దాదాపు 790 హెక్టార్ల భూమి అవసరమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే ఈ మార్గంలో మార్కింగ్ పనులు పూర్తయ్యాయి. 298 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్యలో ఉన్న ముచ్చర్ల ఫ్యూచర్ సిటీ సమీపంలోని తిప్పారెడ్డిపల్లి వద్ద ఈ 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం కానుంది. ఇది అమరావతి మీదుగా మచిలీపట్నం-బందరు పోర్టుకు అనుసంధానమవుతుంది. మొత్తం 297.82 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో తెలంగాణ పరిధిలో 118 కిలోమీటర్లు (40 గ్రామాల మీదుగా), ఏపీలో మిగిలిన భాగం (60 గ్రామాల మీదుగా) విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రెండు భారీ ప్రాజెక్టులకు వేర్వేరుగా కాకుండా ఒకేసారి భూసేకరణ చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాల నిర్మాణం వల్ల భూసేకరణ భారం తగ్గడమే కాకుండా, హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి, బందరు పోర్టుకు ప్రయాణ, సరుకు రవాణా సమయం గణనీయంగా ఆదా కానుంది.

# స్థానిక సంస్థల ఎన్నికలు 2025 నాటి ఓటర్ల జాబితాతోనే ఎలక్షన్స్

**2025 నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక ఎన్నికలు**

**ఏర్పాట్లు ముమ్మరం చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం**

**అక్టోబరు 3న 'సర్' తుది ఓటర్ల జాబితాల ప్రచురణ**

**సర్ జాబితాతో ఎన్నికల నిర్వహణలో జాప్యం**



స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగిసే సమయానికి రాష్ట్రంలో మొత్తం 4,16,27,694 మంది ఓటర్లు నమోదయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం, రాబోయే మున్సిపల్, పంచాయతీ ఎన్నికల కోసం అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాల రూపకల్పన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, మార్పుల చేర్పుల అనంతరం ఈ జాబితాలను అధికారికంగా ప్రచురిస్తున్నారు. 2025 నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యేక సమగ్ర సవరణ తుది ఓటర్ల జాబితాలకు బదులుగా, 2025 ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాల ఆధారంగా నిర్వహించారు. 'తుది జాబితాలు అక్టోబర్ 3న విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, వాటిని స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అవుతుందని భావిస్తున్నారు. దీనివల్ల, 2025 నాటి జాబితాలను ఉపయోగించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. తదనుగుణంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఫోటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రచురించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ ప్రణాళికకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. 21 నుంచి 31వ తేదీ మధ్య పూర్తి బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రత్యేక కమిషన్ తన నివేదికను ఈ శుక్రవారమే సమర్పించింది, దీనిపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తవడం ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయనడానికి సంకేతమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మున్సిపాలిటీల ఓటర్ల జాబితాల ప్రచురణను వచ్చే నెల 3వ తేదీలోపు పూర్తి చేయాలని, అలాగే ఇంకా జాబితాలు సిద్ధం కాని సుమారు యాభై పంచాయతీలకు సంబంధించి ఈ నెల 17వ తేదీలోపు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం మున్సిపల్ పరిపాలన ఒ పట్టణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖలను ఆదేశించింది. అలాగే, పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల ఎంపిక, దానికి సంబంధించిన ప్రక్రియను ఈ నెల 21 నుంచి 31వ తేదీ మధ్య పూర్తి చేయాలని కూడా సూచించింది. అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు లేఖ రాశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఇతర సంబంధిత ఏర్పాట్లను 30 నుంచి 45 రోజుల్లో పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ప్రణాళిక చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలుస్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక కమిషన్ సమర్పించిన నివేదికపై ఈ నెల 18న శాసనసభలో చర్చ జరగనుంది. అదే రోజు ఉదయం మంత్రివర్గం ఈ నివేదికకు ఆమోదం తెలపనుంది, ఆ తర్వాత సభలో దీనిపై చర్చ జరుగుతుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని లేదా బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అలాగే, సోమవారం ప్రారంభం కానున్న నాలుగు రోజుల అసెంబ్లీ సమావేశాల అజెండాపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనిత, నాదెండ్ల మనోహర్ మరియు సత్య కుమార్ యాదవ్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. బీసీలకు రిజర్వేషన్‌పై 18న అసెంబ్లీలో చర్చ సమావేశాల మొదటి రోజైన 17నడీఎస్సీ నియామక ప్రక్రియ, ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై చర్చలు జరగనున్నాయి. రాష్ట్రంపై ఎల్‌నినో వల్ల కలిగే దుష్ప్రభావాలు, వర్షపాత లోపం, తాగునీటి కొరత మరియు ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలు ఇందులో ఉంటాయి. రెండవ రోజు బీసీ రిజర్వేషన్లపై దృష్టి సారిస్తారు. మూడవ రోజు ప్రధానంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామక ప్రక్రియలోని అక్రమాలు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చిస్తారు. నాలుగవ రోజు 'సూపర్-6' పథకాల అమలు, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. గవర్నర్ కోటాలోని రెండు ఖాళీ ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగవచ్చు. సీనియర్ టీడీపీ నేత వర్ల రామయ్య, రాయలసీమ ప్రాంతానికి చెందిన ఒక బీసీ నేతను ఈ పదవులకు నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు యోచిస్తున్నట్లు సమాచారం.

# అవుటర్ రింగ్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు రాత్రి వేళల్లోనే 70 శాతం ఘటనలు

**ఓఆర్ఆర్‌పై ప్రతి ఏటా దాదాపుగా 600 ప్రమాదాలు**

**70 శాతం రాత్రి సమయాల్లోనే జరుపుతున్నట్లు చెబుతున్న నివేదికలు**

**ఏటా సుమారు 150 మరణాలు నమోదు**

**అతివేగమే ప్రధాన కారణమంటున్న అధికారులు**



ఇటీవల ఓ సినీనటి తెల్లవారుజామున అవుటర్ రింగురోడ్డుపై కారులో ప్రయాణిస్తున్నారు. అదే సమయానికి ఆమె కళ్ల ఎదుటే ఓ కారు వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో వెంటనే ఆమె, డ్రైవర్ అక్కడ చేరుకున్నారు. కార్ సేఫ్టీ బెలూన్లు తెరచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్నవారికి ప్రాణాపాయం తప్పింది. వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకొని వారిని ఆసుపత్రికి తరలించారు. రాత్రి సమయంలో అవుటర్ రింగు రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తక్కువ వేగంతో, జాగ్రత్తగా వెళ్లాలని సోషల్ మీడియా వేదికగా ఆమె స్పష్టం చేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. రాత్రి వేళల్లోనే 70 శాతం ప్రమాదాలు ఇలాంటి ప్రమాద ఘటనలు అవుటర్ రింగ్ రోడ్డుపై నిత్యకృత్యం అవుతున్నాయి. ఈ ప్రాంతంలోని మొత్తం ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటలలోపు జరుపుతున్నట్లు పోలీసుల అధ్యయనంలో వెల్లడైంది. ప్రతి సంవత్సరం దాదాపుగా 600 ప్రమాదాలు జరిగితే వాటిలో 350 నుంచి 400 వరకు రాత్రి పూట జరుగుతున్నాయని తేలింది. ఈ ప్రమాదాల కారణంగా ప్రతి సంవత్సరం సగటున 120 నుంచి 150 మంది మరణిస్తున్నట్లు తెలిసింది. పైగా సుమారుగా 400 కంటే ఎక్కువ మంది గాయాలపాలవుతున్నారు. మొత్తం రోడ్డు ప్రమాద మరణాల్లో 70 శాతం వరకు రాత్రి సమయాల్లోనే చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన కారణం నిద్రమత్తు రాత్రి ప్రమాదాలకు ప్రధాన కారణం నిద్రమత్తు. మరి కొందరు దీనికి తోడుగా ఆల్కహాల్ తీసుకోవడంతో ప్రమాదాలు అధికమవుతున్నాయి. వాహనాన్ని వేగంగా నడపడం, అలసట, ఎదురుగా వస్తున్న వాహనాల హైబీమ్ లైట్ల వెలుతురు అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై ప్రయాణించే వాహనాలు సంఖ్య పగలుతో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉంటుంది. ఇలా రోడ్డు కొంత ఖాళీగా ఉండటంతో అనేకమంది తమ వాహనాలను అతి వేగంగా నడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎయిర్‌పోర్టు వైపు వెళ్లే వాహనాలు కూడా మరింత వేగంగా దూసుకు వెళుతున్నాయి. దీంతో ప్రమాదాల తీవ్రత మరింతగా పెరుగుతోంది. అలసట తీర్చుకునేందుకు వాహనాన్ని నిలిపితే ఓఆర్ఆర్‌పై కొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో ట్రక్కులు, లారీల డ్రైవర్లు అలసట తీర్చుకునేందుకు అవుటర్‌పై వాహనాన్ని నిలిపి నిద్రపోతున్నారు. మరికొందరు కాలకృత్యాలకు వెళ్లడం చేస్తున్నారు. ఈ క్రమంలోనే వెనుక నుంచి వచ్చే వాహదారులకు ఆగిన వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో వేగంగా ప్రయాణిస్తున్నారు. దగ్గరకి వచ్చేంతవరకు వాహనాన్ని అంచనా వేయలేకపోతున్నారు. దీంతో వాహనాలను వెనుక నుంచి ఢీకొడుతున్నారు. ఓఆర్ఆర్‌లోని కొన్ని ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదు. కొల్లూరు మార్గం వైపు అనేక ప్రాంతాల్లో లైట్లు వెగటం లేదని పలువురు సంబంధిత వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులను తొలి 2 నుంచి 3 గంటల్లో ఆసుపత్రికి చేర్చితే వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సమాచారం చేరవేతలో ఆలస్యం కోకాపేట, దుండిగల్, ఘట్‌కేసర్, బొంగుళూరు, శంషాబాద్, పటాన్‌చెరు, శామీర్‌పేట, పెద్దఅంబర్‌పేట, తుక్కుగూడ, టీజీసీఎస్ వద్ద అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్) అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి. తారామతిపేట్, పెద్దగోల్కొండ, సుల్తాన్‌పూర్, రావిర్యాల, కొల్లూరు, మేడ్చల్‌లో ఆరు ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులో ఉంటాయి. ఓఆర్ఆర్‌లో రోడ్డు ప్రమాదం సంభవిస్తే ఈ ప్రాంతాల్లో క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆపై ఇతర ఆసుపత్రులకు తరలిస్తారు. అయితే రాత్రి పూట సమాచారం చేరవేతలో ఆలస్యం అవుతోంది. ఇతర కారణాలతో అంబులెన్సుల రాక ఆలస్యమవుతోంది. తక్కువ వేగంతో వెళ్లడం సురక్షితం : ఎయిర్‌పోర్టు, ఇతర ప్రాంతాలకు ప్రయాణించేవారు కాస్త మందుగానే ఇంటి నుంచి బయలుదేరాలి. ఓఆర్ఆర్ ఎక్కిన వెంటనే హెల్ప్‌లైన్, కాల్‌సెంటర్ నంబరును నమోదు చేసుకోవాలి. తక్కువ వేగంతో వెళ్లడం పూర్తి సురక్షితమని భావించాలి. పగలు కంటే రాత్రి పూట ప్యాట్రోలింగ్ టీమ్స్ పర్యవేక్షణ పెంచాలి.

# భోగాపురం విమానాశ్రయంలో బాధ్యతలు స్వీకరించిన సీఐఎస్ఎఫ్

**భోగాపురం విమానాశ్రయం భద్రతలో కీలక ఘట్టం**

**రికార్డు సమయంలో విమానాశ్రయం పూర్తి కావడం పట్ల అభినందనలు తెలిపిన సీఐఎస్ఎఫ్ డీజీ**

**అత్యున్నత స్థాయి భద్రతను, స్నేహపూర్వకమైన సేవలను అందిస్తామని వెల్లడి**



భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా వ్యవస్థలో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్ ) అధికారికంగా తమ భద్రతా బాధ్యతలను స్వీకరించింది. ఈ సందర్భంగా విమానాశ్రయ ప్రాంగణంలో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, సిబ్బందితో కలిసి సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ రంజన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐఎస్ఎఫ్ డీజీ ప్రవీణ్ రంజన్ మాట్లాడుతూ, కేవలం 31 నెలల రికార్డు సమయంలో ఈ విమానాశ్రయ నిర్మాణం పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు అత్యున్నత స్థాయి భద్రతతో పాటు స్నేహపూర్వకమైన సేవలు అందించేందుకు సీఐఎస్ఎఫ్ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో మీడియా మిత్రుల నుంచి నిరంతర సహకారం, పూర్తి మద్దతును ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# కాళ్ల వాపులా? ఒత్తిడి వేధిస్తోందా?

**10 నిమిషాల ఈ ఒక్క ఆసనంతో అద్భుత ఉపశమనం!**

**కాళ్ల వాపులు, ఒత్తిడి తగ్గించే 'విపరీత కరణి' ఆసనంపై పెరుగుతున్న ఆసక్తి**

**కేవలం 10 నిమిషాల్లోనే రక్త ప్రసరణ మెరుగుపరిచి ఉపశమనం**

**గంటల తరబడి కూర్చుని, నిల్చుని పనిచేసేవారికి ఇది ఎంతో మేలు**

**గుండె జబ్బులు, హై బీపీ ఉన్నవారు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**



ఆధునిక జీవనశైలిలో గంటల తరబడి కూర్చోవడం, నిలబడటం సర్వసాధారణమైపోయింది. దీనివల్ల చాలామంది కాళ్ల వాపులు, అలసట, మానసిక ఒత్తిడి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి కేవలం 10 నిమిషాల్లోనే అద్భుతమైన ఉపశమనాన్ని అందించే ఒక సులభమైన యోగాసనం ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందుతోంది. అదే 'విపరీత కరణి' లేదా 'లెగ్స్-అప్-ది-వాల్' ఆసనం. ఎలాంటి ఖరీదైన పరికరాలు లేకుండా ఇంట్లోనే గోడ సహాయంతో ఈ ఆసనాన్ని సులభంగా వేయవచ్చు. ఈ ఆసనం వేయడానికి, నేలపై వెల్లకిలా పడుకుని, కాళ్లను నిటారుగా పైకి చాచి గోడకు ఆనించాలి. ఇలా చేయడం వల్ల గురుత్వాకర్షణ శక్తి సాయంతో కాళ్లలో పేరుకుపోయిన ద్రవాలు, రక్తం తిరిగి గుండె వైపు ప్రసరిస్తాయి. ఫలితంగా కాళ్ల వాపులు, బరువుగా అనిపించడం వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఈ భంగిమ మెదడుకు విశ్రాంతి సంకేతాలను పంపి, నాడీ వ్యవస్థను శాంతపరుస్తుంది. దీనివల్ల శరీరం 'ఫైట్-ఆర్-ఫ్లైట్' (ఒత్తిడి) మోడ్ నుంచి 'రెస్ట్ అండ్ డైజెస్ట్' (విశ్రాంతి) మోడ్‌లోకి మారుతుంది.

### ఎలా పనిచేస్తుంది?.. ప్రయోజనాలేమిటి?

సాధారణంగా ఎక్కువ సేపు కదలకుండా ఉన్నప్పుడు గురుత్వాకర్షణ ప్రభావంతో కాళ్లలో రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. దీంతో పాదాలు, చీలమండలాల్లో ద్రవాలు చేరి వాపు వస్తుంది. వేడి, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, గర్భం, సిరల బలహీనత వంటి కారణాలు ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తాయి. కాళ్లను గుండె కంటే పైకి ఎత్తడం వల్ల ఈ ప్రక్రియ రివర్స్ అవుతుంది. రక్త, లింఫాటిక్ ప్రసరణ మెరుగుపడుతుంది."గంటల తరబడి నిలబడటం, కూర్చోవడం లేదా ప్రయాణాలు చేసేవారు తమ కాళ్లను 10 నుంచి 15 నిమిషాల పాటు పైకి లేపడం వల్ల కాళ్ల బరువు, తేలికపాటి వాపు, అలసట నుంచి ఉపశమనం పొందవచ్చు" అని వైద్య నిపుణులు వివరించారు. ఈ ఆసనం వేసేటప్పుడు దీర్ఘంగా శ్వాస తీసుకోవడం వల్ల గుండె వేగం తగ్గి, మానసిక ఆందోళన కూడా దూరమవుతుంది. డెస్క్ జాబ్స్ చేసేవారు, ప్రయాణికులు, వృద్ధులకు ఇది చాలా ప్రయోజనకరం.

### ఎలా వేయాలి?.. ఎవరు జాగ్రత్తగా ఉండాలి?

ఈ ఆసనం వేయడానికి ముందుగా గోడ పక్కన ఒకవైపు తిరిగి కూర్చోవాలి. నెమ్మదిగా వెల్లకిలా పడుకుంటూ, కాళ్లను పైకి చాచి గోడకు ఆనించాలి. పిరుదులకు, గోడకు మధ్య కొద్దిగా ఖాళీ ఉంచుకోవచ్చు. చేతులను శరీరానికి ఇరువైపులా రిలాక్స్‌గా ఉంచి, 5 నుంచి 10 నిమిషాల పాటు దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి.అయితే, ఈ ఆసనం అందరికీ సురక్షితం కాదు. అదుపులో లేని అధిక రక్తపోటు (హై బీపీ), గ్లకోమా (కంటిలోని ఒత్తిడి), తీవ్రమైన గుండె జబ్బులు ఉన్నవారు, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నవారు ఈ ఆసనానికి దూరంగా ఉండాలి లేదా వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకవేళ కాళ్ల వాపు అకస్మాత్తుగా వచ్చినా, ఒకే కాలులో నొప్పి, ఎరుపుదనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే అవి డీప్ వీన్ థ్రాంబోసిస్ (రక్తం గడ్డకట్టడం) లేదా ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. ఈ ఆసనం కేవలం ఒక సహాయక పద్ధతి మాత్రమేనని, క్రమం తప్పని వ్యాయామం, సమతుల్య ఆహారం, సరైన వైద్య సంరక్షణకు ప్రత్యామ్నాయం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కఠినమైన ఆహార నియమాలు అవసరం లేదు.. ఈ చిన్న అలవాట్లే ఆరోగ్యానికి అసలైన రహస్యం!

**కఠినమైన డైట్‌లు అవసరం లేదంటున్న నిపుణులు**

**ఆకలికి తగ్గట్టు భోజనం ప్లాన్ చేసుకోవాలని సూచన**

**అల్పాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని హితవు**

**ఇష్టమైన ఆహారం పరిమితంగా తీసుకోవచ్చని వెల్లడి**

**చిన్న అలవాట్లే దీర్ఘకాలంలో పెద్ద ఫలితం ఇస్తాయని వివరణ**

**పోషకాహారం ఆరోగ్యానికి కీలకమన్న డబ్ల్యూహెచ్‌ఓ**



బరువు తగ్గాలన్నా లేదా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నా చాలామంది ముందుగా డైట్ (ఆహార నియమాల) గురించే ఆలోచిస్తారు. ఇందుకోసం తమకు ఇష్టమైన ఆహార పదార్థాలను పూర్తిగా దూరం పెట్టి, కొన్ని రోజుల పాటు కఠినమైన నియమాలను పాటిస్తుంటారు. అయితే, ఇలాంటి కఠిన నిబంధనలను ఎక్కువ మంది మధ్యలోనే వదిలేస్తుంటారు. నిజానికి ఆరోగ్యంగా ఉండటానికి ఇంత కష్టపడాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజువారీ జీవనశైలిలో చేసుకునే చిన్నపాటి మార్పులే దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని సూచిస్తున్నారు. అందుకోసం నిపుణులు చెబుతున్న ఐదు సులభమైన చిట్కాలను ఇప్పుడు చూద్దాం..

### ఆకలి సంకేతాలను గుర్తించండి

ముందుగా మన శరీరం ఇచ్చే సంకేతాలను అర్థం చేసుకోవాలి. రోజులో ఏ సమయంలో ఎక్కువగా ఆకలి వేస్తుందో గమనించి, దానికి అనుగుణంగా భోజన సమయాలను ప్లాన్ చేసుకోవాలి. సమయానికి కాకుండా, శరీరం ఇచ్చే ఆకలి సంకేతాలకు ప్రాధాన్యమిస్తే ఆహారపు అలవాట్లు సహజంగా మారుతాయి.

### అల్పాహారం అత్యంత కీలకం

ఆరోగ్య సంరక్షణలో అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) కీలక పాత్ర పోషిస్తుంది. ఇది రోజంతా శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా.. పేగుల ఆరోగ్యం, హార్మోన్ల సమతుల్యత, వ్యాయామ సామర్థ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. కేవలం వ్యాయామం చేస్తే సరిపోదని, దానికి తగిన పోషక విలువలు కలిగిన ఆహారం కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఇష్టమైనవి మానేయాల్సిన పనిలేదు

ఆరోగ్యంగా ఉండాలంటే ఇష్టమైన ఆహారాన్ని పూర్తిగా వదులుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాటిని పరిమిత పరిమాణంలో తీసుకుంటూ, మిగిలిన భోజనాన్ని సమతుల్యంగా ఉండేలా చూసుకుంటే సరిపోతుంది. కొన్ని రోజుల పాటు కఠినమైన డైట్ పాటించడం కంటే, నిత్యం ఆచరించగలిగే చిన్నపాటి ఆరోగ్యకరమైన అలవాట్లే మెరుగైన ఫలితాలను ఇస్తాయి. స్థిరంగా కొనసాగించగలిగే మార్పులే ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

### పోషకాహారమే అసలైన బలం

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా పోషకాహార ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. సమతుల ఆహారం రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది. శరీరానికి అవసరమైన పోషకాలు అందినప్పుడు సహజంగానే శక్తి పెరుగుతుంది. ఇది దీర్ఘకాలిక ఆరోగ్యానికి దోహదపడటంతో పాటు పనితీరును మెరుగుపరుస్తుంది. జీవన నాణ్యతను పెంచుతుంది.

# రాముడి వంశీకులమని కొందరు ఎందుకు చెప్పుకుంటున్నారు ?

## చరిత్ర, పురాణాల్లో ఏముంది







"ఇక్ష్వాకు కుల తిలకా.. ఇకనైన పలుకవే రామచంద్రా.." అంటూ సాగే భక్త రామదాసు కీర్తన తెలుగు వారికి బాగా పరిచితం. రాముణ్ణి తరచుగా ఇక్ష్వాకు వంశీకుడిగా పురాణాల్లో వర్ణిస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఇక్ష్వాకు వంశం పేరు వార్తల్లోకి వచ్చింది."భూమండలం అంతా ఇక్ష్వాకులదా కాదా? ఇక్ష్వాకుల గోత్రం ఏంటి?" అంటూ చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌ను బెదిరిస్తూ 'రామరాజ్యం' సంస్థకు చెందిన వీర రాఘవ రెడ్డి మాట్లాడిన వీడియో ఈ మధ్య వైరల్ అయింది."ఇక్ష్వాకుల గోత్రం కూడా నీకు తెలియదు" అంటూ రంగరాజన్‌ను విమర్శించారు రాఘవ రెడ్డి.ఇంతకీ ఎవరీ ఇక్ష్వాకులు? ఏంటి వారి వంశం? అనేవి అర్థం కావాలంటే మూడు విషయాలు తెలియాలి. ఈ పదం మూడు చోట్ల ప్రముఖంగా వినిపిస్తుంది.హిందూ పురాణాల ప్రకారం రాముడి వంశాన్ని ఇక్ష్వాకు వంశం అంటారు. సూర్యుడి నుంచి ఆ వంశం ఏర్పడింది కాబట్టి సూర్య వంశం అని, రఘు అనే గొప్ప మహారాజు కూడా ఆ వంశీకుడే కాబట్టి రఘువంశం అని కూడా అంటారు.పురాణాల ప్రకారం.. రాముడి వంశంలో మొట్టమొదటి పాలకుడు అంటే అయోధ్య రాజధానిగా కోసల రాజ్యాన్ని పాలించిన వ్యక్తి ఇక్ష్వాకుడు. ఆ ఇక్ష్వాకుడు వైవస్వత మనువు కొడుకు. అలా వారి క్రమంలో 80వ రాజు రాముడు.ముచుకుంద, అంబరీష, భరత, బాహుబలి, హరిశ్చంద్ర, దిలీప, సగర, రఘు, దశరథ...ఇలా వీరంతా రాముడి కంటే ముందు ఇక్ష్వాకు వంశపు రాజులు."శ్రీరాముని వంశ వృక్షాన్ని రఘువంశ మహాకావ్యంలో వర్ణించారు. అది కాళిదాసు రాసిన సంస్కృత మహా కావ్యం. ఇక ఇక్ష్వాకుల వంశ మొదటి రాజుగా ఇక్ష్వాక చక్రవర్తే ఉంటారు. ఇక్ష్వాకు వంశంలో చివరి రాజుగా బృహద్బలుడి పేరు కనిపిస్తుంది. ఆయనే మహాభారతంలో కూడా కనిపిస్తారు. బృహద్బలుడు కౌరవుల తరపున భారత యుద్ధంలో పాల్గొన్నాడు" అని వాస్తు జ్యోతిష్య పండితులు, ఆధ్యాత్మికవేత్త పాలెపు రాజేశ్వర శర్మ బీబీసీతో చెప్పారు.రామాయణంతో పాటు వేదాల్లో కూడా ఇక్ష్వాకు పదం ప్రస్తావన ఉంది. వీటన్నింటిని హిందువుల విశ్వాసాలతో పాటు రామాయణం, భాగవతం, ఇతర పురాణాలు, రఘువంశం కావ్యం పేర్కొన్నాయి.హిందూ గ్రంథాలతో సంబంధం లేకుండా చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, భారతదేశంలో కొన్ని రాజ కుటుంబాలు ఈ పేరును ఉపయోగించుకున్నాయి.అయోధ్య ప్రాంతాన్ని క్రీస్తు పూర్వం 530 ప్రాంతంలో పాలించిన ప్రసేన్‌జిత్ అనే రాజు ఇక్ష్వాకు వంశీకుడని, అలాగే క్రీస్తు పూర్వం 345 ప్రాంతంలో పాలించిన సుమిత్రుడనే రాజు సూర్య వంశీకుడని చెప్పుకున్నట్టు కొందరు చరిత్రాకారులు రాశారు.అయితే ఈ ఇద్దరూ హిందూ పురాణాల్లోని ఇక్ష్వాకు వంశీకులే అనడానికి స్పష్టమైన ఆధారం లేదు.తెలుగునాట కూడా ఓ రాజ వంశానికి ఈ పేరు ఉంది. కృష్ణా నదీ తీరంలో శాతవాహనుల తరువాత పాలించిన రాజులు ఆంధ్ర ఇక్ష్వాకులు. వీళ్లనే విజయపురి ఇక్ష్వాకులు అని కూడా అంటారు.క్రీస్తు శకం 3-4 శతాబ్దాల్లో వీరు పాలించారని ఎక్కువ మంది చరిత్రకారులు చెప్పారు. ప్రస్తుత పల్నాడు జిల్లా మాచర్ల దగ్గర నాగార్జునకొండ వీరి రాజధాని. ఆంధ్ర, తెలంగాణల్లో పలు ప్రాంతాలను వీరు పాలించారు.రాముడి గురించి చెప్పే ఇక్ష్వాకు వంశానికీ వీరికీ సంబంధం ఉన్నట్టు పురాణపరంగా గానీ, చరిత్రపరంగా గానీ ఆధారాలు లేవు."శాతవాహనుల తరువాత ఆంధ్ర ఇక్ష్వాకులు తెలుగునేలను పాలించారు. హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులు, వీరూ ఒకరని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు" అని చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ బీబీసీతో చెప్పారు."నేటికి 2500 ఏళ్ల క్రితమూ, 1700 సంవత్సరాల కిందటా పాలించిన కొందరు రాజులు తమను తాము ఇక్ష్వాకులు అని చెప్పుకున్నారు. కానీ చరిత్రలోని ఇక్ష్వాకులు, పురాణాల్లోని ఇక్ష్వాకులు ఒకరే అని చెప్పే ఆధారాలు లేవు. అసలు హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులుగా చెబుతున్నవారు నిజంగా చరిత్రలో ఉన్నారా? అనే దానికి సైతం స్పష్టమైన ఆధారాలు లేవు. ఇక ఇన్ని వందల సంవత్సరాల తరువాత ఇక్ష్వాకు వంశం వారు ఇంకా ఉన్నారా అంటే సాక్ష్యాలు, ఆధారాలు ఉండవు" అంటున్నారు చరిత్రకారులు హరగోపాల్.జైన సాహిత్యంలోని స్వయంభూ స్తోత్రంలో 1-3-3 శ్లోకంలో 'భగవంతుడైన రిషభదేవుడు ఇక్ష్వాకు వంశానికి మొదటి రాజు' అని రాశారు. ఆయన్నే ఇక్ష్వాకుడు అని జైనులు పిలుస్తారు.రిషభదేవుడు లేదా రిషభనాథుడు జైనుల్లో మొదటి తీర్థంకరుడు. ఈయన్ను జైన మత స్థాపకుడిగా పరిగణిస్తారు.ఇక బౌద్ధంలో కూడా ఇక్ష్వాకు వర్ణనలు ఉన్నాయి. భారత్‌తో పాటు టిబెట్ బౌద్ధ సంప్రదాయాల్లో ఇక్ష్వాకుకు సమానార్థకమైన పదాలతో రాజ వంశాల వర్ణన బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తుంది.

### ఇక్ష్వాకులు ఇప్పుడు ఉన్నారా?

"ఏ కులం వారైనా ఇక్ష్వాకులు అని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు. ఇక్ష్వాకు వంశం ఇప్పటి వరకూ కొనసాగి, ఆ వంశం వారు ఎవరో ఒకరు ఇంకా ఉన్నారనడానికి చెప్పే అవకాశం లేదు. ఎవరైనా చెప్పుకున్నా దానికి సాక్ష్యం ఉండదు. ఈ మధ్య కాలంలో చాలామంది తమ కులం, కుటుంబ గతం ఘనమైనది అని చెప్పుకునే క్రమంలో రాజరికాన్ని ఆపాదించుకుంటున్నారు. వారికి నిజంగా ఘన చరిత్ర ఉందా లేక లేనిదాన్ని ఘనంగా చెప్పుకుంటున్నారా అన్నది చూడాలి" అన్నారు హరగోపాల్."ఒకసారి ఒకరు రాజరికం పొందాక తమను తాము కాని, లేదా వారి ఆస్థానంలోని వారు కాని ఈ రాజులకు దైవత్వం ఆపాదించడం, సూర్య, చంద్ర వంశాల వారంటూ కీర్తించడం భారత చరిత్రలో బాగా కనిపిస్తుంది. దీన్నే శాసనాల్లో, గ్రంథాల్లో రాజ ప్రశస్తి అంటారు" అని శ్రీరామోజు హరగోపాల్ చెప్పారు.

# 'ఉప్పు' తక్కువగా తీసుకుంటున్నారా

**మీ శరీరంలో జరిగే మార్పులివే!**

**ఉప్పు అన్నింటికీ ముప్పే**

**గుండె, కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్న నిపుణులు!**



"వంటల్లో అన్నీ వేసి చూడండి, నన్ను వేసి చూడండి" అంటుందట ఉప్పు. వంటల రుచిలో ఉప్పుదే సింహభాగం. కానీ, అది కాస్త తక్కువైతే పర్లేదు కానీ, ఏ మాత్రం ఎక్కువైనా ఆ పదార్థాలు పక్కన పెట్టేయాల్సిందే. ఉప్పు శరీరంలోని ద్రవ స్థాయిలను నియంత్రిస్తుంది. నరాల సంకేతాలను ప్రసారం చేస్తుంది. కండరాల సంకోచం, సడలింపులో సహాయపడుతుంది. రక్తపోటు, ప్లాస్మా పరిమాణాన్ని నిర్వహించడానికి కూడా ఉప్పు చాలా అవసరం. కానీ, ఉప్పు మితిమిరితే మాత్రం ఆరోగ్యానికి ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. అందుకే, ఉప్పు తీసుకునే పరిమాణంలో నియంత్రణ కలిగి ఉండాలని చెబుతున్నారు.ఈ క్రమంలో ఉప్పు తక్కువగా తీసుకుంటే మనం ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో? వ్యాధుల ముప్పు ఎలా తగ్గుతుందో? ఇప్పుడు తెలుసుకుందాం!ప్రతి ఒక్కరూ ఉప్పు విషయంలో నియంత్రణ కలిగి ఉండాలి. కానీ, చాలామంది సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువగానే తీసుకుంటున్నారు. ఫలితంగా అనేక రకాల ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో పెద్దలు రోజుకు 2000 మిల్లీగ్రాముల కంటే తక్కువ సోడియం (రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పుతో సమానం) లేదా ఒక టీస్పూన్ కంటే కొంచెం తక్కువ తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సిఫార్సు చేస్తోంది. ఎందుకంటే, ఉప్పు వినియోగం పెరిగినప్పుడు, అది గుండె, రక్తపోటు, మూత్రపిండాలు, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అందుకే, ఉప్పు తీసుకోవడం తగ్గించడం చాలా ముఖ్యం.అధిక ఉప్పు వల్ల శరీరం నీటిని నిలుపుకుంటుంది. దీనివల్ల రక్త పరిమాణం పెరిగి గుండెపై అదనపు భారం పడుతుందంటున్నారు నిపుణులు. ఇది రక్తపోటును పెంచి, ధమనులపై ఒత్తిడి కలిగించి హైపర్ టెన్షన్‌కు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల రక్త నాళాలు సడలి, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్తపోటు స్థిరంగా ఉంటుంది. ఉప్పును కొద్దిగా తగ్గించినా త్వరగా ఫలితాలు కనిపిస్తాయట. తలనొప్పి తగ్గడం, మంచి నిద్ర, మైకం తగ్గడాన్ని మీరు గమనించవచ్చు. దీర్ఘకాలంలో ఇది స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, రక్త నాళాల దెబ్బతినకుండా కాపాడుతుందని ఒఎిఅవఅఎివఒఅతీవవ్ పేర్కొంది.ఉప్పు ఎక్కువగా తీసుకుంటే, అది రక్త నాళాల పొరలను దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. ఇది ధమనులలో కొవ్వు పేరుకుపోవడానికి దారితీస్తుందని చెబుతున్నారు. దీనివల్ల ధమనులు మూసుకుపోయి గుండెకు ఆక్సిజన్ అందదు. ఇది కాలక్రమేణా గుండె కండరాలను బలహీనపరుస్తుంది. ఈ క్రమంలో తక్కువ ఉప్పు ఉన్న ఆహారం గుండెపై ఒత్తిడిని తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండె లయను స్థిరీకరిస్తుంది. వంటల్లో ఉప్పును తక్కువగా వాడే వారిలో గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. దీనివల్ల గుండె మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది. హృదయ సంబంధ ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మూత్రపిండాల వ్యాధిని నివారించడానికి, నిర్వహించడానికి కూడా ఉప్పు తగ్గించాలని ఔతీశీశ్‌అవతీంఅఅ పేర్కొంది.ఉప్పు ఎక్కువైతే శరీరంలో ద్రవాలు పేరుకుపోవడం, వాపులు రావడం, మూత్రం ద్వారా ప్రోటీన్ బయటకు పోవడం వంటివి జరుగుతాయి. దీర్ఘకాలికంగా ఉప్పును అధికంగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఉప్పు తగ్గించడం వల్ల ఈ భారం తగ్గుతుందని చెబుతున్నారు.అధిక ఉప్పు హైడ్రేషన్‌కు అంతరాయం కలిగిస్తుంది. దీనివల్ల ముఖం ఉబ్బడం, దాహం, నీటి నిలుపుదల వల్ల అలసట కలుగుతుందంటున్నారు నిపుణులు. మీరు తగినంత నీరు తాగినప్పటికీ, కణాలు వాపునకు గురై డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు. ఉప్పు తగ్గించడం వల్ల ఈ సమతుల్యతను తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. ముఖం, అవయవాల వాపు తగ్గుతుందట. శక్తి స్థాయిలు పెరగడంతో పాటు చర్మం మెరుస్తూ, మైగ్రేన్ వంటి సమస్యలు తగ్గుతాయి.ఉప్పు తగ్గించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. ఇది కడుపు అల్సర్లు లేదా కాలేయ ఒత్తిడి వంటి సమస్యలకు కారణమయ్యే శరీర వాపులను తగ్గిస్తుందని చెబుతున్నారు. రక్తపోటు మందులు వంటి ఔషధాల పనితీరును ఇది మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మానసిక పరంగా చూస్తే, మెదడుకు స్థిరమైన రక్త ప్రసరణ జరగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

# మొక్కలు, పూలు, కుండీల మాటున వచ్చే జంతువులతో ఎంత ప్రమాదమో తెలుసా?



కప్పలు, బల్లులు, పాములు, సాలెపురుగులు, ఇతర క్రిమి కీటకాలను కోసిన పూలు, చిన్నచిన్న కుండీల్లో పెంచే చెట్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా రవాణా అవుతున్నాయని, వీటివల్ల ప్రకృతికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.ఇలా తరలివస్తున్న జీవులలో... షెఫీల్డ్‌లోని ఒక పూల దుకాణంలో గులాబీ పూల నుంచి బయటపడ్డ కప్ప, యూరప్ ప్రధాన భూభాగంలో అలంకరణకు ఉపయోగించే ఆలివ్ మొక్కలలో పాములు దొరికాయి.ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివచ్చే జంతువులు, కీటకాలతో పంటలకు, గ్రామీణ ప్రాంతాల్లోని భూభాగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు.మొక్కలకు, దుంపలకు, పూలకు ప్రపంచ మార్కెట్లలో బాగా డిమాండ్ ఉన్న సమయంలో, రవాణా ప్రమాణాలను తక్షణం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

"ఇలా తరలి వచ్చే జీవుల్లో పాములు, బల్లులు కేవలం చిన్న భాగం మాత్రమే" అని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విల్లియం సదర్లాండ్ చెప్పారు. ఇవే ఇలా ఒకదేశం నుంచి మరో దేశానికి రాగలుగుతున్నప్పుడు ఇక చిన్నచిన్న కీటకాలు, ఫంగీలను గుర్తించే అవకాశం ఎంత?- అవి నిజంగా సమస్యలకు కారణం కావా? అని ప్రశ్నించారు.భౌగోళికంగా ముఖ్యంగా తూర్పు ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో అలంకరణ మొక్కల ఉత్పత్తి చాలా వేగంగా విస్తరించింది.చట్టాలు, సరిహద్దుల్లో తనిఖీలు ఉంటున్నప్పటికీ..పెద్ద ఎత్తున సాగే పూలు, అలంకరణ మొక్కల వాణిజ్యంతో దాని ద్వారా వచ్చే క్రిమి కీటకాలను, వ్యాధులను అడ్డుకోవడం చాలా కష్టమని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సిల్వియు పెట్రోవాన్ చెప్పారు.

షెఫీల్డ్‌లో ఒక పూల దుకాణంలో బతికున్న కప్పను గుర్తించాలని ఒకసారి క్షీరదాల నిపుణుడిని పిలిచారు.ఆయన దాన్ని ఫ్రాంక్ అనుకున్నారు. కానీ, నిజంగానే ఈక్వెడార్ మీదుగా కొలంబియా నుంచి వచ్చిన గులాబీల్లో ట్రీ-ఫ్రాగ్ (ఎక్కువ కాలం చెట్లపై పెరిగే కప్ప)ను గుర్తించి తాను షాకైనట్లు సదరు నిపుణుడు తెలిపారు.బ్రిటన్‌లో కప్పలు, బల్లులు, క్రిమి కీటకాలు ప్రధానంగా ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నాయి. యూరప్‌లో, ఎన్నో అరుదైన సరీసృపాలు, ఉభయచర జీవులు దొరుకుతున్నాయి.కుండీల్లో పెంచే ఆలీవ్ మొక్కలలో గుర్తిస్తున్న జీవులు, జంతువులు.బల్లులు, యూరోపియన్ భూభాగంలో ఉండే పలు రకాల పాములు కప్పలు, కప్పలు మాదిరి ఉండే జీవులు పెద్ద సంఖ్యలో క్రిమి కీటకాలు అదొక అడవి దున్నల పుర్రెల పర్వతం, దాని వెనుక ఓ దారుణమైన కుట్ర కథ.

బయోసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక రీసర్చ్ పేపర్‌లో, 2017-18 మధ్య కాలంలో నెదర్లాండ్స్‌లో కస్టమ్ అధికారుల తనిఖీల్లో అలంకరణ మొక్కల్లో దొరికిన కీటకాల రికార్డులను ఒక టీమ్ పరిశీలించింది.తమ పరిశీలనలను 2021-23లో యూకేలోని పర్యావరణం, ఆహారం, గ్రామీణ వ్యవహారాల విభాగానికి రిపోర్టు చేసింది.ఉత్పత్తి ప్రమాణాలను మెరుగుపర్చాలని, వాణిజ్యంలో ఉన్న నిర్దిష్ట ప్రమాదాల డేటాను సేకరించి,షేర్ చేయాలని వారు కోరారు.

# ఇన్వెస్టర్లు ఇక క్యాష్ రెడీ చేసుకోండి వచ్చేవారం మెగా ఐపీఓల జాతర

### ఆ ఒక్క ఐపీఓపైనే అందరి కన్ను

భారతదేశ ప్రాథమిక స్టాక్ మార్కెట్ మరో అత్యంత బిజీ వారానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే 42 ప్రధాన కంపెనీలు ఐపీఓల ద్వారా రూ. 54,378 కోట్లు సమీకరించగా, ఆగస్టు 17 నుండి ఆగస్టు 21 మధ్య మరొక ఐదు కంపెనీలు తమ పబ్లిక్ ఇష్యూలను ప్రారంభించనున్నాయి. వీటి ద్వారా మొత్తం రూ. 5,499.32 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అదే సమయంలో.. ఇప్పటికే పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న మరో ఐదు కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కానున్నాయి ఆగస్టు 17 సోమవారం నాడు హెురైజన్ ఇండస్ట్రియల్ పార్క్స్, లలితా జ్యువెలరీ మార్ట్ తమ ఐపీఓలను ప్రారంభిస్తున్నాయి. హెురైజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ రూ. 2,600 కోట్లు సమీకరించాలని చూస్తోంది. ఈ వారంలో ం ఐదు ఐపీఓల మొత్తం నిధుల సమీకరణలో ఒక్క హెురైజన్ వాటాయే దాదాపు 47 శాతంగా ఉంది. ఈ కంపెనీ ఒక్కో షేరుకు రూ. 57 నుండి రూ. 60 ధరల శ్రేణిని నిర్ణయించింది. రెండవ అతిపెద్ద ఇష్యూగా వస్తున్న లలితా జ్యువెలరీ మార్ట్ రూ. 1,700 కోట్లను లక్ష్యంగా పెట్టుకుని.. ఒక్కో షేరు ధరను రూ. 190 నుండి రూ. 201గా నిర్ణయించింది. ఈ రెండు ఇష్యూలు ఆగస్టు 19 వరకు పెట్టుబడుల కోసం తెరిచి ఉంటాయి. ఆ కంపెనీల్లో భారీగా పెట్టుబడి పెట్టిన మ్యూచువల్ ఫండ్లు.. ఆగస్టు 18న శంకేష్ జ్యువెలర్స్, సన్‌షైన్ పిక్చర్స్ తమ ఇష్యూలను ప్రారంభించనున్నాయి.




శంకేష్ జ్యువెలర్స్ ఒక్కో షేరుకు రూ. 88 నుండి రూ. 93 ధరల శ్రేణితో రూ. 367.18 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, సన్‌షైన్ పిక్చర్స్ ఒక్కో షేరుకు రూ. 342 నుండి రూ. 360 ధరల శ్రేణితో రూ. 282.14 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. ఈ రెండు ఇష్యూలు ఆగస్టు 20 వరకు అందుబాటులో ఉంటాయి. ఈ వారపు చివరి ఐపీఓ అయిన గజ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 19న ప్రారంభమై ఆగస్టు 21న ముగుస్తుంది. ఈ కంపెనీ రూ. 550 కోట్లు సమీకరించాలని చూస్తుండగా, షేరు ధర ంరూ. 152 నుండి రూ. 160 మధ్య ఉంది. ఈ ఐదు కంపెనీల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ కానున్నాయి. ఇన్వెస్టర్లు డబ్బులు రెడీ చేసుకోండి.. రూ. 1700 కోట్లు టార్గెట్‌తో కొత్త వచ్చేస్తోంది.. పూర్తి వివరాలు ఇవే మరోవైపు ఇప్పటికే ఐపీఓలను పూర్తి చేసుకుని.. సంయుక్తంగా రూ. 7,478.69 కోట్లు సమీకరించిన మరో ఐదు కంపెనీల షేర్లు ఈ వారం స్టాక్ మార్కెట్‌లో అరంగేట్రం చేయనున్నాయి. రూ. 3,066.89 కోట్లు సమీకరించిన ధూత్ ట్రాన్స్‌మిషన్, రూ. 939.70 కోట్లు సమీకరించిన మోల్బియో డయాగ్నోస్టిక్స్ ఆగస్టు 17న లిస్ట్ కానున్నాయి. రూ. 1,553 కోట్లు సమీకరించిన మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ షేర్లు ఆగస్టు 18న మార్కెట్లోకి రానున్నాయి. అలాగే రూ. 1,617.48 కోట్లు సమీకరించిన షిప్‌రాకెట్, రూ. 301.62 కోట్లు సమీకరించిన బెహారీ లాల్ ఇంజనీరింగ్ కంపెనీల షేర్లు ఆగస్టు 19న స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కానున్నాయి. ఐదేళ్లలో రూ.23 నుంచి రూ.1,666 చేరిన మల్టీబ్యాగర్ స్టాక్ ఇదే.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# హార్ముజ్ జలసంధిపై ట్రంప్ సంచలన ప్రకటన

### ఇంచు కూడా తాకలేరంటూ ఇరాన్ ఘాటు రిప్లై

అగ్రరాజ్యం అమెరికా- ఇరాన్‌తో సైనిక ఉద్రిక్తతలు, దౌత్యపరమైన వైఫల్యాలు కొనసాగుతున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపాయి. న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌లో జరిగిన ఒక రిపబ్లికన్ ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రస్తుతం సాగుతున్న సంఘర్షణలో ఇరాన్‌ను ఓడించిన తర్వాత వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన హార్ముజ్ జలసంధిని అమెరికా సొంత భూభాగంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు. లాంగ్ ఐలాండ్ వేదికగా ట్రంప్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయంగా సముద్ర వాణిజ్య వర్గాలలో, దౌత్య వర్గాల్లో విపరీతమైన చర్చకు దారితీసింది. ఈ ర్యాలీలో అధ్యక్ష సైనిక వ్యూహాలను వివరిస్తూ.. ప్రస్తుతం ఇరాన్ సైనిక బలగాలు తీవ్రంగా బలహీనపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. హార్ముజ్ జలసంధిపై అమెరికా నావికాదళానికి సంపూర్ణ నియంత్రణ ఉందని, ఈ వ్యూహాత్మక జలమార్గంపై తమ ఆధిపత్యాన్ని మరింత కట్టుదిట్టం చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ సముద్ర మార్గంలో ఇరాన్‌ను నియంత్రించడానికి అమెరికా నావికాదళం విధించిన దిగ్బంధనాన్ని ఒక చొరబడలేని ఉక్కు గోడగా ఆయన అభివర్ణించారు. ఇరాన్ విడుదల చేస్తున్న ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయని.. ఆ దేశ మిలిటరీ తీవ్రంగా దెబ్బతిని ప్రతిఘటించే శక్తిని కోల్పోయిందని ఆరోపించారు టన్నుల కొద్దీ బంగారాన్ని ఇరాన్?కు చేర్చిన యూఏఈ.. ఎందుకంటే. అయితే ట్రంప్ చేసిన ఈ ప్రకటనలను ఇరాన్ ప్రభుత్వం తక్షణమే ఖండించింది. అమెరికా అధికారులు, ట్రంప్ చేస్తున్న వాదనల్లో ఎలాంటి వాస్తవం లేదని, ట్వీట్లు లేదా బెదిరింపులతో హార్ముజ్ జలసంధిని అమెరికా ఆక్రమించలేదని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇరాన్ విధించిన షరతులను అమెరికా, అంతర్జాతీయ సమాజం ఆమోదించే వరకు హార్ముజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. జలసంధి ద్వారా నౌకాయానం ఇకపై మూసివేయబడలేదని వైట్ హౌస్ ప్రతినిధులు పదేపదే చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదని ఇరాన్ స్పష్టం చేయడంతో రెండు దేశాల మధ్య తీవ్ర వ్యత్యాసాలు బయటపడ్డాయి. అమెరికాతో చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. హార్ముజ్ జలసంధి వద్ద తీవ్రరూపం దాల్చిన ఉద్రిక్తతలు.. హార్ముజ్ జలసంధిని పునఃప్రారంభించడంపై అమెరికా ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నప్పటికీ, అవి పురోగతి




సాధించడంలో విఫలమవుతున్నాయి. ప్రపంచంలో సరఫరా అయ్యే ముడి చమురులో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండానే రవాణా అవుతుంది. అటువంటి సున్నితమైన మార్గంలో ఉద్రిక్తతలు పెరగడం ంఅంతర్జాతీయ ఇంధన మార్కెట్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే భద్రతా కారణాల రీత్యా అనేక వాణిజ్య చమురు నౌకలు తమ ప్రయాణ మార్గాలను మార్చుకోవడంతో సముద్ర రవాణా వ్యయం గణనీయంగా పెరిగింది. చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. మళ్ళీ భగ్గుమన్న ముడిచమురు ధరలు.. ఆగని హార్ముజ్ టెన్షన్.. మరోవైపు రష్యా చమురు కొనుగోళ్లపై 100 శాతం సుంకం విధించే బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించడం వల్ల భారత్, చైనాల వంటి దిగుమతిదారులపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. అంతర్జాతీయంగా సంయమనం పాటించాలని దేశాలు పిలుపునిస్తున్నప్పటికీ. అమెరికా నావికా దిగ్బంధనం, ఇరాన్ మొండివైఖరితో ప్రాంతంలో తీవ్ర అస్థిరత కొనసాగుతోంది.

# పడిక్కల్ సూపర్ సెంచరీ గాలే టెస్టులో ముగిసిన తొలి రోజు ఆట

### శ్రీలంకతో తొలి టెస్టులో సెంచరీతో మెరిసిన దేవదత్ పడిక్కల్

### కండరాల నొప్పితో 77 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్

### తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 288 పరుగులు చేసిన భారత్

### వెలుతురు లేమి, వర్షం కారణంగా ముందుగానే ముగిసిన తొలి రోజు ఆట

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ (131 నాటౌట్), తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. అతనికి తోడు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) కూడా రాణించడంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేసే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది.గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. అయితే, జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, తీవ్రమైన కండరాల నొప్పితో కేఎల్ రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది.గాయపడిన సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పడిక్కల్, లభించిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. క్రీజును చక్కగా ఉపయోగించుకుంటూ, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా బ్యాక్ ఫుట్‌పై ఆకట్టుకునే షాట్లు ఆడాడు. 134 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 2002లో సౌరవ్ గంగూలీ తర్వాత భారత జట్టులో మూడో స్థానంలో టెస్టు శతకం సాధించిన తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా పడిక్కల్ రికార్డు సృష్టించాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య



బౌలింగ్‌లో అనవసర షాట్‌కు యత్నించి మిడ్-ఆఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (27 నాటౌట్) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. పడిక్కల్‌తో కలిసి అజేయంగా 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయినా, బ్యాటర్ల జోరు తగ్గలేదు. అయితే, వెలుతురు మందగించడంతో అంపైర్లు తొలి రోజు ఆటను 17 ఓవర్లు ముందుగానే ముగించారు. పడిక్కల్ 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులు, పంత్ 36 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట 15 నిమిషాలు ముందుగా ప్రారంభం కానుండగా, భారత్ 500 పైచిలుకు స్కోరుపై కన్నేసింది.ం

## రిలయన్స్, రోల్స్ రాయిస్ ఒప్పందం యుద్ధ

# విమానాలకు 'దేశీ' ఇంజిన్ తయారీ

యుద్ధ విమాన ఇంజిన్ తయారీకే పరిమితం కాకుండా భవిష్యత్తులో రక్షణ రంగం, సివిల్ ఏవియేషన్ రంగాలకు మార్గం సుగమం చేస్తుందని ఇరు కంపెనీల ప్రకటన.భారత రక్షణ రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేలా ఒక భారీ ఒప్పందం కుదిరింది. భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ రంగ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కు చెందిన ప్రపంచ ప్రసిద్ధ ఏరో ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్-రాయిస్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రతిష్ఠాత్మక ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్ట్ అయిన అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం స్వదేశీ యుద్ధ విమాన ఇంజిన్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నాయి. ఈ మేరకు శు క్రవారం ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఈ కూటమి కేవలం యుద్ధ విమాన ఇంజిన్ తయారీకే పరిమితం కాకుండా భవిష్యత్తులో రక్షణ రంగం, సివిల్ ఏవియేషన్, సరికొత్త పవర్, ప్రొపల్షన్ సిస్టమ్స్ వంటి విస్తృత భాగస్వామ్యాలకు కూడా మార్గం సుగమం చేస్తుందని ఇరు సంస్థలు తెలిపాయి.భారత్‌లో ప్రత్యేకంగా ఒక ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఇరు సంస్థలు తమ ప్రకటనలో వెల్లడించాయి. దీనిని పవర్, ప్రొపల్షన్ టెక్నాలజీలో ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దనున్నారు. ఈ కాంప్లెక్స్‌లో యుద్ధ విమాన ఇంజన్లకు సంబంధించిన ఈ క్రింది అన్ని పనులను ఒకే చోట పూర్తి చేస్తారని పేర్కొంది. ఈ కేంద్రం ద్వారా యుద్ధ విమాన ఇంజిన్ల డిజైన్, అభివృద్ధి, తయారీ, ఉత్పత్తి, టెస్టింగ్, నిర్వహణ వంటి అన్ని కార్యకలాపాలనూ దేశీయంగానే చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. రక్షణ రంగంలో విదేశీ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ భాగస్వామ్యం కుదిరింది. ఈ




సందర్భంగా కీలకమైన సాంకేతికతల్లో స్వయం సమృద్ధి సాధించడం ఎంతో అవసరమని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ అభిప్రాయపడ్డారు. రోల్స్-రాయిస్ ప్రపంచ స్థాయి నైపుణ్యం, రిలయన్స్ సామర్థ్యాలను కలిపి ప్రపంచస్థాయి ఏరో ఇంజిన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ భాగస్వామ్యం ఏరోస్పేస్ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధనలో మైలురాయిగా నిలుస్తుందని రోల్స్ రాయిస్ సీఈఓ తుఫాన్ ఎర్గెన్‌బిల్గిక్ అన్నారు."భారతదేశం వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని సాధించాలంటే ఇలాంటి క్లిష్టమైన సాంకేతికతల్లో స్వంత సామర్థ్యం కలిగి ఉండటం చాలా అవసరం. రోల్స్-రాయిస్ నైపుణ్యాన్ని, రిలయన్స్ సాంకేతికత, ఉత్పాదకత, భారీ స్కేల్, అమలు సామర్థ్యాలతో అనుసంధానించడం ద్వారా భారతదేశంలోనే ఒక బలమైన ఏరో-ఇంజన్ వ్యవస్థను నిర్మిస్తాం. ఇది రాబోయే రోజుల్లో దేశాన్ని స్వయంసమృద్ధిగా మార్చడమే కాకుండా ప్రపంచస్థాయిలో పోటీ పడేలా చేస్తుంది."అనంత్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.ప్రస్తుతానికి రెండు కంపెనీలు తమ వ్యూహాత్మక ఉద్దేశాన్ని మాత్రమే ప్రకటించాయి. ఇది ఇంకా పూర్తి స్థాయి జాయింట్ వెంచర్?గా లేదా అధికారిక కాంట్రాక్ట్‌గా మారలేదు. ఆ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటు దిశగా వేసిన మొదటి అడుగు మాత్రమే. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆర్థిక పెట్టుబడుల వివరాలను, కాలపరిమితిని లేదా ఇరు కంపెనీల వాటాల వివరాలను ప్రస్తుతానికి ఇరు సంస్థలు వెల్లడించలేదు."అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' అనేది భారతదేశం స్వదేశీ సాంకేతికతతో తయారు చేస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్ట్. శత్రువుల రాడార్లకు కూడా చిక్కకుండా దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం.

# ఏపీలో మహిళల క్రికెట్‌కు కొత్త శకం మంగళగిరి వేదికగా ఉమెన్స్ ఏపీఎల్

### ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ నిర్వహణకు ఏర్పాట్లు . సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు

### మంగళగిరిలో టోర్నీ . మొత్తం 4 జట్లు.. ఇప్పటికే పూర్తయిన బిడ్డింగ్ ప్రక్రియ . లీగ్‌కు మద్దతు

### ప్రకటించిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ . ఒక జట్టును రూ.89 లక్షలకు దక్కించుకున్న ఉషోదయ

### ఎంటర్‌ప్రైజెస్



ఆంధ్రప్రదేశ్‌లో మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే దిశగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కీలక ముందడుగు వేసింది. పురుషుల కోసం విజయవంతంగా నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) తరహాలోనే తొలిసారిగా 'మహిళల ఏపీఎల్' నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరి వేదికగా జరగనుంది.ఈ లీగ్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడనున్నాయి. ఇప్పటికే జట్ల కోసం బిడ్డింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని కేశినేని చిన్ని తెలిపారు. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఒక జట్టును రూ.89 లక్షల అత్యధిక బిడ్‌తో దక్కించుకుంది. మిగిలిన జట్లను కూడా ఇతర సంస్థలు సొంతం చేసుకున్నాయి.ఈ ప్రకటన సందర్భంగా భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా పాల్గొంది. మహిళల కోసం ప్రత్యేకంగా లీగ్ నిర్వహించడంపై ఆమె హర్షం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో మహిళల క్రికెట్‌కు ఆదరణ బాగా పెరిగిందని, ఈ లీగ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారిణులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. జాతీయ జట్టుకు ఎంపికయ్యేందుకు ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడింది.ప్రస్తుతానికి ప్రతి జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడుతుందని, భవిష్యత్తులో ప్రేక్షకుల ఆదరణను బట్టి జట్ల సంఖ్యను పెంచే ఆలోచన ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ లీగ్‌లో ఆడేందుకు ఇప్పటికే దాదాపు 200 మంది క్రీడాకారిణులు తమ పేర్లను నమోదు చేసుకోవడం విశేషం.

# బెంగళూరులో కనిపించిన బంద్ ప్రభావం యథావిధిగా నడుస్తున్న బస్సులు, మెట్రో




కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాలకు నిరసనగా రైతులు, వివిధ కన్నడ సంఘాలు ఈ రోజు కర్ణాటక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆగస్టు 12 నుంచి 15 రోజుల పాటు తమిళనాడుకు రోజుకు 12,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, కన్నడ అనుకూల సంఘాలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 12 గంటల పాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు బంద్ కొనసాగనుంది.బంద్ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రజా రవాణా, ఇతర సాధారణ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని బెంగళూరు నగర పోలీసులు స్పష్టం చేశారు. ప్రైవేట్ రవాణా సేవలు కూడా యథావిధిగా పనిచేస్తాయని భావిస్తున్నారు. కర్ణాటక శాసనసభ 10 రోజుల వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ బంద్ పిలుపు వచ్చింది. బంద్‌లో పాల్గొనాలని, దుకాణాలు లేదా సంస్థలను మూసివేయాలని, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించాలని లేదా ఇష్టం లేకపోయినా నిరసనల్లో పాల్గొనాలని ఎవరినీ బలవంతం చేయకూడదని లేదా బెదిరించకూడదని పోలీసులు హెచ్చరించారు. కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం.. గుట్కా, పాన్ మసాలపై నిషేధం.. నగరంలో శాంతి, ప్రజా భద్రత, సాధారణ పరిస్థితులను కాపాడటంలో బెంగళూరు నగర పోలీసులకు సహకరించాలని అన్ని సంస్థలను, ప్రజలను బెంగళూరు పోలీసులు కోరారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రజా రవాణా, ఇతర సాధారణ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని పోలీసులు ప్రకటించారు. మెట్రో రైళ్లు కూడా నడుస్తాయని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయం లేదా ఆందోళన లేకుండా తమ దైనందిన కార్యకలాపాలను యథావిధిగా కొనసాగాలని కోరారు. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ , కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘాలు ఈ బంద్‌కు దూరంగా ఉన్నాయి.ఆగస్టు 13న సుప్రీంకోర్టులో జరగనున్న విచారణకు ముందు, రాష్ట్రానికి ఎటువంటి అన్యాయం జరగకుండా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం చూసుకుంటుందని కర్ణాటక మంత్రి రామలింగ రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడు పిటిషన్ దాఖలు చేసిందని.. తమకు నోటీసు అందిందని పేర్కొన్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

## హార్ముజ్ జలసంధి తెరవాలంటే ఈ షరతులు ఒప్పుకోవాల్సిందే

### ట్రంప్‌కు డెడ్ లైన్ పెట్టిన ఇరాన్



ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఇంధన రవాణా మార్గమైన హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ ఆరు షరతులను విధించింది. ఈ జలసంధిని తిరిగి తెరవాలంటే అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని స్పష్టం చేస్తూ.. వాషింగ్టన్ ముందు ఆరు ప్రధాన డిమాండ్లను ఉంచినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ మాజీ కార్యదర్శి, సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ సలహాదారు అయిన మొహమ్మద్ బఘేర్ జోల్ఘదర్ వెల్లడించారు. మరోవైపు ఈ మార్గంలో వాణిజ్య నౌకల నిర్వహణ కోసం ఒమన్‌తో ఉమ్మడి సాంకేతిక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరాన్ చేరువైంది. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం రవాణా నిర్వహణలో టెహ్రాన్, మస్కట్‌లకు ఉమ్మడి బాధ్యతలు ఉంటాయి. అయితే ఒమన్‌తో ఒప్పందం కుదిరినంత మాత్రాన జలసంధి తెరుచుకోదని.. తమ ఆరు పొలిటికల్ డిమాండ్లను పరిష్కరిస్తేనే సాధారణ నౌకాయానం సాధ్యమవుతుందని ఇరాన్ విదేశాంగంంశ మంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధిపై ట్రంప్ సంచలన ప్రకటన.. ఇంచు కూడా తాకలేరంటూ ఇరాన్ ఘాటు రిప్లై.. ఇరాన్ విధించిన 6 ప్రధాన డిమాండ్లు: 1. బెదిరింపులు నిలిపివేత: ఇరాన్‌పై అమెరికా తన బెదిరింపు ధోరణిని, అవమానకరమైన భాషను శాశ్వతంగా మానుకోవాలి. 2. ప్రాంతీయ వివాదాల ముగింపు: లెబనాన్, పాలస్తీనా, యెమెన్ మరియు ఇరాక్‌లలో ఇరాన్ మరియు దాని మిత్రదేశాలపై అమెరికా సాగిస్తున్న సైనిక దురాక్రమణను తక్షణమే ముగించాలి. 3. నావికా దిగ్బంధనం ఎత్తివేత: ఇరాన్ చుట్టూ ఉన్న ప్రాంతాల నుండి అమెరికా నావికా, వైమానిక దళాలను ఉపసంహరించుకోవడంతో పాటు విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. 4. యుద్ధ పరిహారం: ఇటీవల జరిగిన రెండు యుద్ధాలలో (2025లో జరిగిన 12 రోజుల యుద్ధంతో సహా) ఇరాన్‌కు జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి అమెరికా భారీ పరిహారం చెల్లించాలి. 5. ఆంక్షల రద్దు: ఇరాన్‌పై విధించిన క్రూరమైన, చట్టవిరుద్ధమైన ఆర్థిక ఆంక్షలను తక్షణమే తొలగించాలి. 6. స్తంభింపజేసిన ఆస్తుల విడుదల: విదేశాలలో జప్తు చేసిన లేదా స్తంభింపజేసిన ఇరాన్ నిధులను, ఆస్తులను బేషరతుగా విడుదల చేయాలి. చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. మళ్ళీ భగ్గుమన్న ముడిచమురు ధరలు.. ఆగని హార్ముజ్ టెన్షన్.. చర్చలపై ఇరాన్ సంచలన ప్రకటన.. మళ్ళీ భగ్గుమన్న ముడిచమురు ధరలు.. ఆగని హార్ముజ్ టెన్షన్.. పర్షియన్ గల్ఫ్, అరేబియా సముద్రాన్ని కలిపే ఈ 33 కిలోమీటర్ల ఇరుకైన జలసంధి నిలిచిపోవడం వల్ల గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ తీవ్ర ఆందోళన చెందుతోంది. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం.. ఈ జలసంధి గుండా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా అవుతుంది. ఇందులో 82 శాతం ఆసియా దేశాలకే వెళ్తుంది. ముఖ్యంగా ఇరాన్ ఎగుమతి చేసే మొత్తం చమురులో 90 శాతాన్ని చైనానే కొనుగోలు చేస్తోంది. ఈ జలసంధి మూసివేత వల్ల ఆసియా రిఫైనరీలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ముప్పు ఏర్పడింది. ఇరాన్ షరతుల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా 3 శాతం పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు వి86.03 డాలర్లకు చేరుకోగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 80.61 డాలర్లకి పెరిగింది. మరోవైపు ఇరాన్‌గుండా వెళ్లే నౌకలను స్వయంగా పర్యవేక్షించడమే కాకుండా రుసుములు వసూలు చేయాలని యోచిస్తుండటంపై షిప్పింగ్ పరిశ్రమ వర్గాలు చట్టపరమైన, బీమా సంబంధిత ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. వైట్ హౌస్ ఈ విధివిధానాలను గమనిస్తుండగా.. అంతర్జాతీయ సమాజం ఇరాన్-అమెరికా మధ్య తదుపరి దౌత్యపరమైన పరిణామాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.




# సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.




# కట్టలు తెంచుకున్న రోమాన్స్.. హుషారు పిట్టలు !

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణెళిశన్)ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చేశారు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుంది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు చాటుమాటుగా సాగిన రవి - చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్థం ఆసక్తికరంగా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి - చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం.. తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్ డేట్ ఫిక్స్.. ఆసక్తికరంగా ఫస్ట్ లుక్

వైవిధ్యమైన కథలు, ప్రత్యేకమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ చిత్రానికి సంబంధించిన మేజర్ అప్‌డేట్‌ను మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 9న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విప్లవం సృష్టించడానికి కాకుండా, థియేటర్లలో పూర్తి స్థాయి నవ్వుల విప్లవాన్ని పంచడానికి 'కామ్రేడ్ కళ్యాణ్' వస్తున్నాడని చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. 1990ల కాలం నాటి వింటేజ్ ఫ్లేవర్‌లో.. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని మాడుగుల నేపథ్యంతో ఈ పీరియడ్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తుండగా, సత్య, ముక్కు అవినాష్‌తో పాటు పలువురు ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తుండగా, కోన వెంకట్ సమర్పిస్తున్నారు. వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, భాస్కరభట్ల సాహిత్యం సమకూరుస్తున్నారు. విభిన్నమైన మాస్ లుక్‌లో శ్రీవిష్ణు కనిపిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలను త్వరలోనే మరింత వేగవంతం చేయనున్నారు.




# విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల




స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ది ఇండియన్ బార్డర్.. దేశభక్తి ఉప్పొంగేలా 'జిందా రహేన్ తో డ్యూటీ' సాంగ్




ఆదిత్య మీనన్, అజయ్, మురళీమోహన్, కిరణ్ యార్లగడ్డ, ఆదర్శ్ సింధు తులానీ, మేఘ శ్రీ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం ది ఇండియన్ బార్డర్ డీఎస్ బాషా డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఇండిపెండెన్స్ డే కానుకగా 'జిందా రహేన్ తో డ్యూటీ' అంటూ సాగే సాంగ్‌ను లాంచ్ చేశారు. డీఎస్ బాషా రాసిన ఈ పాటను ఆనంద్ మంత్ర కంపోజిషన్‌లో శర్వాణా పాడాడు. సరిహద్దులో జవాన్ల త్యాగాలు, ధైర్య సాహసాలను గుర్తు చేసేలా.. నరనరాల్లో దేశ భక్తిని రగిల్చేలా సాగుతోంది. పాలస్తీనా వార్ టైంలో తనలో ఈ కథ పుట్టిందని సాంగ్ ఈవెంట్‌లో రైటర్ కమ్ హీరో కిరణ్ యార్లగడ్డ అన్నాడు. డీఎస్ భాషా కథకు ఓ రూపాన్ని తీసుకొచ్చారు. సైనికుడు, సైనికుడి భార్య చేసే త్యాగాలను ఈ సినిమాలో చూపించామన్నాడు. ది ఇండియన్ బార్డర్ సైనికుడి త్యాగం, ఆలోచనలు, గొప్పదనం చెప్పేలా ఉంటుందని డైరెక్టర్ డీఎస్ బాషా అన్నారు. అందుకే ఈ సాంగ్‌ను కూడా సైనికుడికి అంకితం చేసేలా తీశాం. మనమంతా ఈ రోజు ఇక్కడ సంతోషంగా ఉన్నామంటే.. అందుకు కారణం సైనికుడు చేసే త్యాగమే. కిరణ్ చెప్పిన కథ నాకు చాలా బాగా నచ్చింది. ఇంత మంచి కథలో భాగమవ్వడం నాకు సంతోషంగా ఉందని డైరెక్టర్ డీఎస్ బాషా చెప్పుకొచ్చారు.

PUBLISHED AND OWNER BY AVANAGANTI ANIL KUMAR Published at 3-83/A, BADANGPET, BALAPUR, RANGAREDDY District TELANGANA - 500058. Printed at SMILYSONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District, TELANGANA - 500070. EDITOR AVANAGANTI ANIL KUMAR PRGI NO. : TGTEL/26/A2290 , CELL : 9133444314